‘పద్మావతి’ చెంత ప్రథమ పౌరురాలు



రేణిగుంట విమానాశ్రయం

సాయంత్రం 4.05 గంటలు. ఒడిశా రాష్ట్రం ఝూర్సుగూడా నుంచి ప్రత్యేక విమానం రేణిగుంట విమానాశ్రయం చేరుకుంది. విమానం నుంచి దిగిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు రాష్ట్ర ప్రభుత్వం తరపున ఘన స్వాగతం లభించింది. హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత, దేవదాయ శాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ హరి జవహర్ లాల్, ఎంపీ గురుమూర్తి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి, కలెక్టర్ వెంకటేశ్వర్, ఐజీ రాజకుమారి, ఎస్పీ సుబ్బరాయుడు తదితరులు ఆమెకు స్వాగతం పలికారు.

ఏడుకొండల స్వామి దర్శనానికి దేశ ప్రథమ పౌరురాలు, రాష్ట్రపతి ద్రౌపదిముర్ము గురువారం సాయంత్రం జిల్లాకు వచ్చారు. తిరుచానూరులో పద్మావతి అమ్మవారిని దర్శించుకుని తిరుమల చేరుకున్న ఆమె.. శుక్రవారం ఉదయం శ్రీవారిని దర్శించుకోనున్నారు.

- రేణిగుంట/తిరుచానూరు/తిరుమల, ఆంధ్రజ్యోతి

ఆలయంలో అరగంటకుపైగా

పద్మావతి ఆలయం వద్ద గ్రీన్ రూమ్‌లోకి వెళ్లిన రాష్ట్రపతి పది నిమిషాలు విశ్రాంతి తీసుకున్నారు. 4.55 గంటలకు ఆలయంలోకి విచ్చేశారు. మొదట ధ్వజస్తంభానికి మొక్కారు. సన్నిధిలోని అమ్మవారి మూలమూర్తిని దర్శించుకున్నారు. వేదపండితులు వేదాశీర్వచనం చేసి అమ్మవారి శేషవస్త్రంతో సత్కరించారు. లడ్డూ ప్రసాదాలతో పాటు అమ్మవారి చిత్రపటాన్ని ఈవో బహూకరించారు. ఆలయం వెలుపలకు వచ్చిన ఆమె 5.26 గంటలకు తిరుమలకు బయలుదేరారు.



పద్మావతి అమ్మవారి ఆలయం

4.40 గంటలు: కుమార్తె, మనవడు, మనవరాలు తదితరులతో కలిసి రాష్ట్రపతి తిరుచానూరులోని పద్మావతి అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. మహద్వారం వద్ద దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, మంత్రి అనిత, టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అర్చకులు ఆమెకు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో మురళీకృష్ణ, ఆలయ డిప్యూటీ ఈవో హరిందర్‌నాథ్, అర్చకులు శ్రీనివాసాచార్యులు, బాబుస్వామి తదితరులు పాల్గొన్నారు.



తిరుమలలో రాష్ట్రపతి

సాయంత్రం 6.15 గంటలు: తిరుమలలోని పద్మావతి అతిథిగృహానికి చేరుకున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు హోంమంత్రి అనిత, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, సభ్యులు పనబాక లక్ష్మి, జానకీ దేవి, భానుప్రకాష్‌రెడ్డి, అదనపు ఈవో వెంకయ్య చౌదరి పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. రిసెప్షన్ అధికారులు వసతి, దర్శన ఏర్పాట్లు చేశారు. శుక్రవారం ఉదయం క్షేత్రసంప్రదాయం ప్రకారం తొలుత వరాహస్వామిని.. ఆ తర్వాత వేంకటేశ్వరస్వామిని రాష్ట్రపది దర్శించుకుని తిరుగు ప్రయాణంకానున్నారు.



రామదూతపై అభయప్రదాత



తిరుచానూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రామదూత హనుమంతుడిని వాహనంగా చేసుకుని పట్టాభిరామునిగా పద్మావతి అమ్మవారు గురువారం రాత్రి భక్తులకు అభయమిస్తూ ముందుకు సాగారు. తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో భాగంగా హనుమంత వాహనంపై మాడవీధుల్లో ఊరేగిన అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. ఉదయం కల్పవృక్ష వాహనంపై మురళీకృష్ణ అలంకరణలో అమ్మవారు తిరువీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. గజతురగ అశ్వాలు ముందుకు సాగుతుండగా జీయర్‌స్వాముల దివ్య ప్రబంధ పారాయణం, మంగళవాయిద్యాలు, చిన్నారుల కోలాటం, భజనలు, కళాకారుల నృత్యప్రదర్శన, భక్తుల గోవిందనామస్మరణ నడుమ వాహన సేవలు సాగాయి. మధ్యాహ్నం శ్రీకృష్ణస్వామి ముఖమండపంలో ఉత్సవమూర్తికి స్నపన తిరుమంజనం.. సాయంత్రం ఆస్థాన మండపంలో ఊంజల్‌సేవ నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో జీయర్‌స్వాములు, టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, జేఈవో వీరబ్రహ్మం, ఆలయ డిప్యూటీ ఈవో హరీందర్‌నాథ్, ఏఈవో దేవరాజులు, ఏవీఎస్వో రాధాకృష్ణమూర్తి, అర్చకులు బాబుస్వామి, మణికంఠస్వామి, సూపరింటెండెంట్లు రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, చలపతి, సుబ్బరాయుడు సుభాస్కర్‌నాయుడు తదితరులుపాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

ఉదయం 8 గంటలకు పల్లకీ ఉత్సవం
సాయంత్రం 3.30 గంటలకు వసంతోత్సవం
రాత్రి 7 గంటలకు గజ వాహనసేవ





టైగర్ రొయ్యకు ‘వైట్‌స్పాట్’



రొయ్యలను గ్రేడింగ్ చేస్తున్న రైతులు

కోట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వైట్‌స్పాట్ వైరస్ ఆక్వా రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. రొయ్యలను పట్టేసి విక్రయిద్దామనుకుంటున్న తరుణంలో అల్పపీడన ద్రోణి కారణంగా విపరీతమైన చలితో పాటు మంచు కురుస్తోంది. అదే సమయంలో వైట్‌స్పాట్ వైరస్‌తో రొయ్యలు మృత్యువాత పడుతుండటంతో ఆక్వా రైతులు విలవిలలాడుతున్నారు. సముద్ర తీర ప్రాంతాలైన చిల్లకూరు, కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లో టైగర్, వెనామి రొయ్యల పెంపకం చేపట్టారు. వాతావరణంలో మార్పులు, విపరీతమైన మంచు కురుస్తుండటంతో టైగర్ రొయ్యలకు వైట్‌స్పాట్ సోకుతోంది. నీటిలో ఉన్న రొయ్యలకు 35 డిగ్రీల ఉష్ణోగ్రతలు ఉండాలి. ప్రస్తుతం వాతావరణ మార్పుల వల్ల 11 నుంచి 12 డిగ్రీలకు ఉష్ణోగ్రత పడిపోవడంతో రొయ్యలు వైరస్ బారిన పడుతున్నాయి. దీంతో రొయ్యలు మేత తినకుండా బరువు తగ్గి చనిపోతున్నట్లు రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రధానంగా కోట మండలంలోని వావిళ్ల దొరువు, శ్రీనివాససత్రం, దొరువుకట్ట, ఉత్తమనెల్లూరు గ్రామాల్లో వైట్‌స్పాట్ ఉన్నట్లు రైతులు చెబుతున్నారు.



వైట్‌స్పాట్‌తో మృతి చెంది ఉన్న టైగర్ రొయ్యపిల్లలు

వర్క్ హార్డ్.. అచీవ్ లాట్

విజయానికి దగ్గరి దారి లేదన్న భువనేశ్వరి

కుప్పం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ‘విజయానికి దగ్గరి దారి అనేది లేదు. వర్క్ హార్డ్ అండ్ అచీవ్ లాట్ అంతే.’ సీఎం చంద్రబాబు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి విద్యార్థుల్లో స్ఫూర్తి నింపుతూ అన్న మాటలివి. కుప్పం పురపాలక సంఘం పరిధిలోని పరమసముద్రం వద్ద గల కేజీబీవీ, గురుకుల పాఠశాలలను గురువారం ఆమె సందర్శించారు. విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. ‘పేద కుటుంబాలనుంచి ఎన్నో కష్టనష్టాలకోర్చి ఇక్కడిదాకా వచ్చి చదువుకుంటున్న పిల్లలు బాధ్యతగా మెలగాలని సూచించారు. ‘మీలాగే ఎంతోమంది పేద పిల్లలు ఎన్టీఆర్ ట్రస్టు స్కూల్‌లో చదువుకుంటున్నారు. అక్కడ నూరు శాతం రిజల్ట్ వస్తాయి. నాకు ఆ పిల్లల్ని చూస్తే చాలా గర్వంగా ఉంటుంది.’ అన్నారు. అబ్దుల్ కలాం, ధీరూబాయ్ అంబానీ, ఎన్టీ రామారావు, చంద్రబాబు నాయుడు వంటివాళ్లు పేద, మధ్యతరగతి కుటుంబాలనుంచి వచ్చి ఉన్నత స్థానాలకు చేరారని గుర్తు చేశారు. ఇంకా ఎంతోమంది పేదరికాన్ని ధిక్కరించి ఎన్నో లక్ష్యాలను సాధించారని అలాంటి వారిని ఆదర్శంగా తీసుకోవాలని ఉద్బోధించారు. ‘ఒక తల్లిగా చెబుతున్నా. టీనేజిలో ఉన్న ఆడపిల్లలు అప్రమత్తంగా ఉండాలి. ఎవరినీ నమ్మొద్దు. చదువుమీద, ఉన్నత లక్ష్యంమీద ఫోకస్ ఉండాలి. జీవితంలోపైకి ఎదగాలి’ అని సూచించారు. శ్రమిస్తేనే ఏ విజయమైనా దక్కుతుందన్నారు. కేజీబీవీ స్కూల్‌లోనే విద్యార్థులతో కలిసి భోంచేశారు. అక్కడ్నుంచి గురుకుల పాఠశాలకు విద్యార్థులతో కలిసి ఆటోలో వెళ్లారు.



విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజన క్యూలో నిలుచున్న భువనేశ్వరి

■ నేడు ప్రపంచ మత్స్య దినోత్సవం

అపార మత్స్య సంపద

అపారమైన మత్స్య సంపద తిరుపతి జిల్లాకు ఆదాయవనరుగా మారింది. 80 కిలోమీటర్ల సముద్రతీరం, పులికాట్ సరస్సు ఇందుకు ప్రధాన కారణం కాగా, ఊరూరా ఉన్న చెరువుల్లోనూ మంచినీటి చేపల పెంపకం విస్తృతంగా జరుగుతోంది. సముద్రం, పులికాట్‌ల నుంచి ఏటా 60 వేల టన్నులకు పైగా చేపలు, 20 వేల టన్నుల రొయ్యలు లభిస్తున్నాయి. వీటి ద్వారా ఏటా రూ.400 కోట్ల ఆదాయం సమకూరుతోంది. మంచినీటి చేపల ఉత్పత్తి వల్ల కూడా రూ. 300 కోట్ల ఆదాయం జిల్లా పొందుతోంది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



గండి రకం చేపలు





రొయ్యలు



గురకలు రకం చేపలు

కొరమేను చేపలు



బొచ్చె రకం చేప

ఏటా పాతిక వేల టన్నుల ఉత్పత్తి

రూ.300 కోట్లకు పైగా వార్షికాదాయం

జిల్లా మత్స్య సంపద

మత్స్యకార గ్రామాలు: 42
మత్స్యకార కుటుంబాలు: 14,874
మత్స్యకార జనాభా: 70 వేలు
మత్స్యకారుల సంఖ్య: 17,874
ఆక్వా రైతుల సంఖ్య: 2219
చేప పిల్లల పెంపకం కేంద్రాలు: 3
చేపల చెరువులు: 570

ఆక్వా రైతులు నిర్వహిస్తున్న చేపల చెరువులు: 6445

జిల్లాలో మంచినీటి చేపలు ఏటా 25 వేల టన్నుల వరకూ ఉత్పత్తి అవుతున్నాయి. ఇందులో సహజ సిద్ధంగా 15 వేల టన్నుల చేపలు ఉత్పత్తి అవుతుంటే ఆక్వా రైతుల పెంపకం ద్వారా 10 వేల టన్నుల చేపలు ఉత్పత్తి అవుతున్నాయి. 20 వేలకు పైగా కుటుంబాలు ఉపాధి పొందుతున్నాయి. ఈ చేపల ఎగుమతి, విక్రయాల ద్వారా రూ. 300 కోట్ల మేరకు వార్షికాదాయం లభిస్తోంది.ఈ ఏడాది కూడా మత్స్య శాఖ జిల్లావ్యాప్తంగా 25 లక్షల చేపల పెంపకం లక్ష్యంగా పిల్లలను చెరువులు,రిజర్వాయర్లలో విడుదల చేసింది. ఈ ఏడాది పుష్కలంగా వానలు కురిసి చెరువులు, రిజర్వాయర్లలో నీళ్ళు నిండుగా వుండడంతో చేపల ఉత్పత్తి అంచనాలకు మించి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ప్రాజెక్టుల్లోనూ చేపల పెంపకం

జిల్లాలో 570 చెరువుల్లో చేపల పెంపకం జరుగుతోంది. దీనికి అదనంగా మత్స్యశాఖ తిరుపతిలోనూ, కళ్యాణి డ్యామ్, అరణియార్ ప్రాజెక్టుల వద్ద స్వయంగా చేప పిల్లల పెంపకం కేంద్రాలు నిర్వహిస్తోంది. ఇక కోట, వాకాడు, చిల్లకూరు, చిట్టమూరు మండలాల్లో ఆక్వా రైతులు చేపల, రొయ్యల పెంపకం పెద్ద ఎత్తున చేపడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 2219 మంది ఆక్వా రైతుల 6445 చిన్నచిన్న చేపల చెరువులు నిర్వహిస్తున్నారు.

స్థానికంగా దొరికే చేపల రకాలు

జిల్లాలో చెరువులు, రిజర్వాయర్లలో బొచ్చె (కట్ల), గండి (రోహు), మోసు (మృగాల), బంగారుతీగ, పక్కిలు, బెడిసెలు, జెల్లలు, ఇసుక పురి, గెరిగేని, కొరమేను, గురకలు లేదా జిలేబీలు (తిలాపియా), బొమ్మిడాలు, తేలుమాయి, వనామీ వంటి చేపలు ఎక్కువ పరిమాణంలో దొరుకుతున్నాయి.

లాభాలిచ్చేవి ఇవీ.. : జిల్లా పరిస్థితులను బట్టి చూస్తే గండి, బొచ్చె, మోసు, రూప్‌చంద్, ప్యాంగాసియస్ రకాల చేపలు ఆక్వా రైతులకైనా, మత్స్యకారులకైనా లాభదాయకమని మత్స్య శాఖ అధికారులు చెబుతున్నారు. ఉత్పత్తి ఎక్కువగా వుండడం, విక్రయాలు బాగా వుండడమే దీనికి కారణమని చెబుతున్నారు.



వాకాడు మండలంలోని చేపల చెరువులు



మోసు రకం చేపలు



గురక లేదా జిలేబీ రకం చేప

సమగ్ర శిక్ష ఏపీసీగా మహిళా వర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ అనురాధ

తిరుపతి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): విద్యా శాఖలో సమగ్ర శిక్షా విభాగం అదనపు ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్‌గా తిరుపతి పద్మావతీ మహిళా వర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నున్నం అనురాధ నియమితులయ్యారు. ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఎనిమిది జిల్లాలకు వేర్వేరు శాఖల్లో విధులు నిర్వర్తిస్తున్న అధికారులను డెప్యుటేషన్‌పై సమగ్ర శిక్షా ఏపీసీలుగా నియమించింది. అందులో భాగంగా స్థానిక మహిళా వర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ అనురాధను డెప్యుటేషన్‌పై అన్నమయ్య జిల్లా సమగ్ర శిక్షా ఏపీసీగా నియమించింది. ఈ పోస్టులో ప్రాథమికంగా ఏడాదిపాటు కొనసాగనున్నారు.

విద్యార్థులకు రవాణా భత్యం విడుదల

- మొదటి విడతగా రూ.2.02 కోట్లు తల్లుల ఖాతాల్లో జమ

తిరుపతి (విద్య), నవంబరు 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే అర్హులైన విద్యార్థులకు రవాణా భత్యాన్ని ప్రభుత్వం విడుదల చేసినట్లు డీఈవో కేవీఎన్ కుమార్ గురువారం తెలిపారు. ఒకటి నుంచి పదో తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో ప్రాథమిక పాఠశాలలకు ఒక కిలోమీటరు దూరం, ప్రాథమిక పాఠశాలలకు 3 కిలోమీటర్లు, ఉన్నత పాఠశాలలకు 5 కిలోమీటర్ల దూరం ప్రయాణించి పాఠశాలలకు వచ్చే విద్యార్థులకు సంవత్సరానికి రూ.6 వేల చొప్పున రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోంది. ఆమేరకు 6,752 మంది విద్యార్థులను విద్యాశాఖ గుర్తించింది. వీరికి మొదటి విడతగా రూ.2,02,56,000 ప్రభుత్వం విడుదల చేసింది. ఈ మొత్తాన్ని నేరుగా విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమచేసినట్టు డీఈవో తెలిపారు.

శిశు మరణాలు తగ్గించాలి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వైద్యులు

చంద్రగిరి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): నవజాత శిశు మరణాలు తగ్గించడం కోసమే జాతీయ నవజాత శిశు వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు వైద్యులు తెలిపారు. చంద్రగిరిలోని రూరల్ హెల్త్ సెంటర్‌లో గురువారం జాతీయ నవజాత శిశు వారోత్సవాలు నిర్వహించారు. ఇందులో హెల్త్ ఆఫీసర్లు డాక్టర్లు శ్రీధర్, మధుసూదనరావు, యుగంధర్, సౌమ్యప్రియ, డెంటల్ అసిస్టెంట్ సర్జన్ రేవతి పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరమూ నవంబరు 15 నుంచి 21వ తేదీ వరకు జాతీయ నవజాత శిశు వారోత్సవాలు నిర్వహిస్తారని, శిశు ఆరోగ్యం, సంరక్షణ ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహన కల్పించడం, శిశు మరణాలు తగ్గించడమే దీని లక్ష్యమని తెలిపారు. అనంతరం అవగాహన పోస్టర్లను వైద్యులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది టాటాబాయి, ప్రమీల, నారాయణరాజు, సుబ్బలక్ష్మి, గిరిజ, శశిరేఖ పాల్గొన్నారు.

బాలబాలికల సమస్యలపై అవగాహన అవసరం



ర్యాలీలో సూపర్‌వైజర్ రేవతి, ఐసీడీఎస్ సిబ్బంది

రామచంద్రాపురం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): బాలబాలికల సమస్యలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేవతి అన్నారు. మండలంలోని అనుపల్లి, కుప్పంబాదూరు గ్రామాల్లో మిషన్‌శక్తి సంబల్ కార్యక్రమంలో భాగంగా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బేటీ బచావో, బేటీ పడావో అవగాహన ర్యాలీ చేపట్టారు. గురువారం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పిల్లల అక్రమ రవాణా, బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాల నిషేధంపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కృష్ణమూర్తి, సృజనకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు విమల, తరుణ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్కలు నాటుతున్న వలంటీర్లు

తిరుపతి రూరల్, నవంబరు20(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం అడపారెడ్డిపల్లె జెడ్పీ హైస్కూల్, అంగన్వాడీ కేంద్రాల ప్రాంగణాల్లో ఎస్వీ వ్యవసాయ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు గురువారం మొక్కలు నాటారు. కళాశాల జాతీయ సేవాపథక(ఎన్ఎస్ఎస్) శిబిరంలో భాగంగా గ్రామంలో పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ అధికారిణి డాక్టర్ ఎన్.సబిత మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకుని మొక్కలు నాటాలన్నారు. మొక్కలను నాటి భూమిని కాపాడుకుందామని పిలుపునిచ్చారు. భూమిపై వేగంగా విస్తరిస్తున్న విషతుల్యమైన వయ్యారిభామ కలుపుమొక్కల నిర్మూలన ఎంతో అవశ్యమని అవగాహన కల్పించారు. డాక్టర్ సి.నాగమణి, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వ్యర్థాల నుంచి పశువులను కాపాడండి

భాకరాపేట, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వ్యర్థాల నుంచి పశువులను కాపాడాలని భాకరాపేటకు చెందిన దాసరి శ్రీనివాసులు చిన్నగొట్టిగల్లు ఎంపీడీవో గిడ్డయ్యకు వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ భాకరాపేట పంచాయతీలో సేకరించిన చెత్త నుంచి ఘన వ్యర్థాలను వేరు చేయగా మిగిలిన చెత్తను, హోటళ్ల నుంచి వచ్చే ప్లాస్టిక్ కవర్లను ఎక్కడబడితే అక్కడ వేస్తున్నారని తెలిపారు. పశువులు వాటిని తిని అనారోగ్యం పాలవుతున్నాయని పేర్కొన్నారు. ఇటీవల మూడు ఆవులు చనిపోయాయన్నారు. పోస్టుమార్టం చేయగా వాటి కడుపులో భారీగా ప్లాస్టిక్ పేపర్లు బయటపడ్డాయన్నారు. కావున ప్లాస్టిక్ వ్యర్థాలను చెత్త సేకరణ కేంద్రాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన ఎంపీడీవో ఆ మేరకు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారని శ్రీనివాసులు తెలిపారు.

రేపటి నుంచి చంద్రగిరిలో హాకీ టోర్నీ



మైదానాన్ని చదును చేస్తున్న నిర్వాహకులు

చంద్రగిరి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఏపీ ఆధ్వర్యంలో శనివారం నుంచి హాకీ టోర్నమెంట్ ప్రారంభించనున్నట్లు సెక్రటరీ భార్గవి కిషోర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి అండర్ 14 హాకీ టోర్నమెంటులో క్రీడాకారులు పాల్గొంటారని పేర్కొన్నారు. ఇందులో బాలురు 234 మంది, బాలికలు 234 మంది ఉన్నారని వెల్లడించారు. పోటీలను కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, స్థానిక ఎమ్మెల్యే పులివర్తి నాని ప్రారంభిస్తారని పేర్కొన్నారు. స్థానిక పీడీలు, పీఈటీల పర్యవేక్షణలో ఏర్పాట్లు చేశారు.

వేడుకగా అయ్యప్పస్వామి పడిపూజ



తిరుపతిరూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం కేసీపేట గ్రామంలోని రామాలయం వద్ద గురువారం అయ్యప్పస్వామి మహా పడిపూజ కార్యక్రమాన్ని వేడుకగా నిర్వహించారు. గ్రామానికి చెందిన అయ్యప్ప మాలధారణ భక్తులందరూ కలసికట్టుగా పాల్గొని స్వామివారి భజన, కీర్తనలు ఆలపించారు. పడిపూజ మొక్కు చెల్లించారు. అన్నప్రసాద వితరణ చేశారు. గురుస్వామిగా సి.రామాపురానికి చెందిన ఉదయ్ వ్యవహరించారు. గ్రామస్థులు పాల్గొన్నారు.

ఈయూ మంగళం డిపో గౌరవాధ్యక్షుడిగా కృష్ణప్రసాద్



కృష్ణప్రసాద్‌ను సన్మానిస్తున్న నేతలు

తిరుపతి(ఆటోనగర్), నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ మంగళం డిపో గౌరవాధ్యక్షుడిగా జనసేన నేత, వాకర్స్ ఇంటర్నేషనల్ రీజనల్ కౌన్సిలర్ ఆర్కాట్ కృష్ణప్రసాద్‌ను ఎన్నుకున్నారు. లీలామహల్ కూడలిలోని ఒక హోటల్‌లో గురువారం యూనియన్ నాయకులు సమావేశమయ్యారు. కార్మికుల సమస్యలపై చర్చించారు. అనంతరం ఆయన్ను గౌరవాధ్యక్షుడిగా ఎన్నుకుని సన్మానించారు. కృష్ణప్రసాద్ మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. నాయకులు ఎ.మురగమ్మ, ఎ.మనోజ్‌కుమార్, జిఆర్.చంద్ర, వి.మస్తాన్, గురునాథం, టి.వెంకటేశ్వరబాబు, బి.రామారావు పాల్గొన్నారు.

పేగు కాన్సర్‌పై అవగాహన



తిరుపతి(విశ్వవిద్యాలయాలు), నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా యూనివర్సిటీ ఉమెన్ స్టడీస్ ఆధ్వర్యంలో పేగు క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వెదురుకుప్పం మండలం అగ్గిచేనుపల్లెలో గురువారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో అధ్యాపకురాలు ఉమాదేవి మాట్లాడుతూ సరైన ఆహార అలవాట్లు లేకపోతే ఈ వ్యాధి వస్తుందన్నారు. వ్యాధి లక్షణాలు, దశలు, జాగ్రత్తలు, చర్యలపై డాక్టర్‌ను సంప్రదించాలని కోరారు. తద్వారా నివారణ సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇంద్రాణి, మహిళలు పాల్గొన్నారు.

పద్మావతి అమ్మవారికి గొడుగుల వితరణ



తిరుచానూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి ఆలయానికి తమిళనాడుకు చెందిన భాష్యకార కైంకర్య ట్రస్టు చైర్మన్ మాధవనాయుడు 8 గొడుగులను అందజేశారు. సూపరింటెండెంట్ రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ వీటిని స్వీకరించి దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. అమ్మవారి దర్శన ఏర్పాట్లు చేశారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు



విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న ఎంపీడీవో, ఈవో

చంద్రగిరి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి పాతపేటలోని ప్రభుత్వ గ్రంథాలయంలో వారోత్సవాలు గురువారం ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీడీవో వెంకటరత్నం, చంద్రగిరి పంచాయతీ ఈవో చంద్రశేఖర్‌రెడ్డి హాజరయ్యారు. ఎంపీడీవో మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకుని విజ్ఞానవంతులు కావాలన్నారు. బయట ఎక్కడా దొరకని సమాచారం కేవలం ఒక్క గ్రంథాలయంలోనే దొరుకుతుందని తెలిపారు. అనంతరం వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి రెడ్డెమ్మ పాల్గొన్నారు.

గ్రంథాలయాలతో విజ్ఞానం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న సర్పంచ్ కస్తూరి

పాకాల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గురువారంతో ముగిశాయి. పాకాల, దామలచెరువు గ్రంథాలయాలలో ఈనెల 14వ తేదీ ప్రారంభమైన ఈ ఉత్సవాల్లో ఏడు రోజుల పాటు బాలల దినోత్సవం, మాదక ద్రవ్యాలపై అవగాహన, పుస్తక పఠనం ప్రదర్శన, కవి సమ్మేళనాలు, పాఠశాల, కళాశాలల్లో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వ, క్విజ్, క్రీడా పోటీలు, మహిళలకు రంగవల్లి అల్లికల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు కస్తూరి, సునీత, డిగ్రీ కాలేజి ప్రిన్సిపాల్ రమేష్ కుమార్, బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రెడ్డిరామిరాజు, ఎస్వీఎస్ హెచ్ఎం రోహిణి, పాకాల పంచాయతీ కార్యదర్శి లావణ్యలత, పాఠకులు విద్యాసాగర్, ఆనంద, గుప్త, హరి, గ్రంథాలయ అధికారులు రవీంద్రబాబు, మురళీబాబు పాల్గొన్నారు.

జీవితంపై విరక్తితో వ్యక్తి ఆత్మహత్య



తిరుపతి (నేరవిభాగం), నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): తిరుపతి పట్టణంలోని పెద్దకాపు లేఅవుట్ ప్రాంతంలోని ఓ రెసిడెన్సీలో నవీన్ (34) ఆత్మహత్యకు పాల్పడ్డారు. బాపట్ల జిల్లా బట్టిప్రోలు మండలం వెల్టూరుకు గ్రామానికి చెందిన ఇతడు తిరుపతి- తిరుమల మధ్య జీపు నడుపుతూ జీవిస్తున్నారు. సుమారు ఏడు నెలల కిందట ఈయన భార్య నీరజ మృతిచెందారు. ఆపై తాగుడికి బానిసైన నవీన్.. తన ఇద్దరు పిల్లల్ని చూసుకోలేక బాధపడుతున్నాడు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం ఇక్కడి రెసిడెన్సీలో గది అద్దెకు తీసుకుని సీలింగ్ ఫ్యాన్‌కు బెడ్ షీట్‌తో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి రావులపల్లి అంజినేయులు ఫిర్యాదు మేరకు ఈస్ట్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

అధ్వానంగా పాకాల - యల్లంపల్లె రోడ్డు




బురద, నీటితో నిండి ఉన్న పాకాల - యల్లంపల్లె రోడ్డు

పాకాల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పాకాల వయా పంటపల్లె - యల్లంపల్లె రోడ్డు అధ్వానంగా ఉంది. పాకాల నుంచి పంటపల్లె వరకు 2 కిలోమీటర్ల రెండు వరుసల తారు రోడ్డు ఉంది. అక్కడి నుంచి యల్లంపల్లె కిలోమీటరు దూరంలో ఉంది. గ్రామం నుంచి 400 మీటర్ల సీసీ రోడ్డు వేశారు. పంటపల్లె - యల్లంపల్లె వరకు మిగిలిన 600 మీటర్లు రోడ్డు నిర్మాణం అసంపూర్తిగా ఉంది. ఈ రోడ్డు నిర్మాణానికి, భూసేకరణకు ఎన్నికలకు ముందు తుడా నిధులు రూ.60 లక్షలు మంజూరు చేశారు. కొంతమేర మట్టిపనులు చేశారు. ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో పనులు నిలిచిపోయాయి. మంజూరైన నిధులు ఎంపీడీవో ఖాతాలో మురుగుతున్నాయి. యల్లంపల్లె గ్రామ సమీపంలో జగనన్న కాలనీ ఏర్పాటు చేసి 262 గృహ నిర్మాణాలు మంజూరు చేశారు. గ్రామానికి సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో మంజూరైన గృహాలలో 10 శాతం కూడా పూర్తి కాలేదు. ఈ 600 మీటర్ల రోడ్డు నిర్మాణం పూర్తయితే పూతలపట్టు - నాయుడుపేట జాతీయ రహదారికి అనుసంధానమవు తుంది. శంఖంపల్లె వద్ద జాతీయ రహదారిలో కలిస్తే పాకాల మండల పరిసర వాసులకు సౌకర్యంగా ఉంటుంది. పాకాల - నేంద్రగుంట రోడ్డు మార్గంలో రెండు రైల్వే గేట్లతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే రైల్వే గేట్ల బెడద లేకుండా పాకాల నుంచి తిరుపతికి వాహనాలు వెళ్లడానికి సౌకర్యంగా ఉంటుంది. ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి అసంపూర్తిగా వున్న రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని కోరుతున్నారు.

ప్రకృతి వ్యవసాయం రైతులకు ఎంతో మేలు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రాజెక్టు కోఆర్డినేటర్ నీరజ

రామచంద్రాపురం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మహిళా రైతులు సేంద్రియ, ప్రకృతి వ్యవసాయ పద్ధతులు అవలంబించడం ద్వారా ఎంతో మేలు జరుగుతుందని రాష్ట్రీయ ఉచ్చతర్ శిక్ష అభియాన్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ డాక్టర్ నీరజ పేర్కొన్నారు. మండలంలోని కుప్పంబాదూరులో శ్రీపద్మావతి మహిళ విశ్వవిద్యాలయ మహిళ అధ్యయన విభాగం ఆధ్వర్యంలో మహిళా రైతులకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమం గురువారం ముగిసింది. ఆమె మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయంపై అవగాహన పెంచుకుని తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం పొందాలన్నారు. పంటలకు సేంద్రియ ఎరువులను ఉపయోగించాలన్నారు. ప్రకృతి వ్యవసాయంతో పండిన కూరగాయలను తీసుకోవడం వల్ల ఆరోగ్యం బాగుంటుందని తెలిపారు. మండల మోడల్ టీం లీడర్ విమల మాట్లాడుతూ మహిళా రైతులు పండించిన పంటలు మహిళలే అమ్ముకునే విధంగా ప్రోత్సహించి వ్యాపారవేత్తలుగా తయారు చేస్తామన్నారు. అనంతరం జీవామృతం, బీజామృతం, పంచగవ్యతో పాటు వివిధ రకలా కషాయాల తయారీపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు అసిస్టెంట్ జయశ్రీ, క్లస్టర్ ఇన్‌చార్జి మిథున్‌రెడ్డి, మార్కెటింగ్ మాస్టర్ ట్రైనర్ రాగమ్మ, నాచురల్ ఫార్మింగ్ హెల్త్ న్యూట్రిషియన్ మేఘన, యూనిట్ ఇన్‌చార్జి లాలెమ్మ, ఐసీఆర్‌పీలు సుబ్రహ్మణ్యంరెడ్డి, రామయ్య, మోడల్ మేకర్ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా బాలల హక్కుల దినోత్సవం



బహుమతులు అందుకున్న ప్రభుత్వ బాలికల కళాశాల విద్యార్థులు

పాకాల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో గురువారం బాలల హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కిరణ్మయి బాలల హక్కుల గురించి వివరించారు. ప్రిన్సిపాల్ పి.రెడ్డిరామరాజు మహిళా సాధికారిత, స్త్రీవిద్య, బాల్యవివాహాలతో తలెత్తే అనర్థాలపై అవగాహన కల్పించారు. విద్యార్థినులకు వివిధ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు తులసీ రామిరెడ్డి, భరణీకుమార్, విజయలక్ష్మీ దేవి, సరళాదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు శారద, సుజాత, వనిత తదితరులు పాల్గొన్నారు.

మొగరాల జడ్పీ హైస్కూల్‌లో : బాలల హక్కులపై విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. హెచ్ఎం సుమలత, ఉపాధ్యాయులు వి.వెంకటసిద్దులు, ఆదిశేషవులు నాయుడు, రామ్మూర్తి, సుల్తాన్, ప్రబోధిని, నీరజ, దయానంత, తులసి తదితరులు పాల్గొన్నారు.

వేమూరు ప్రకృతి వ్యవసాయక్షేత్ర సందర్శన



తిరుపతిరూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం వేమూరులోని అయ్యప్ప నాయుడు ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని గురువారం తమిళనాడు రాష్ట్రం వేలూరు జిల్లాకు చెందిన రైతులు సందర్శించారు. చెరకు, మల్బరీ పంటలలో ఆచరిస్తున్న ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పరిశీలించారు. ద్రవజీవామృతం, పంచగవ్య, దశపర్ణి కషాయాల తయారీ పద్ధతులను రైతులకు వివరించారు. రాస్ కృషి విజ్ఞాన కేంద్ర సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ నేల ఆరోగ్య పరిరక్షణకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులు దోహదం చేస్తాయని, పంటల సాగులో కంపోస్ట్, పచ్చిరొట్ట, జీవన ఎరువులను వినియోగించి నేల ఆరోగ్యాన్ని కాపాడాలని ఆకాంక్షించారు. కషాయాలను వాడటం వల్ల పంటలని ఆశించే పురుగులు, తెగుళ్లను నియంత్రించవచ్చని వివరించారు. కాగా వేలూరుకు చెందిన ఆత్మ సౌజన్యంతో నిర్వహించిన నాలుగు రోజుల విజ్ఞానయాత్రలో భాగంగా రాస్ కృషి విజ్ఞాన కేంద్రం, ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను పలువురు రైతులు సందర్శించారు. వ్యవసాయ కళాశాల విద్యార్థులు, వేలూరు ఆత్మ సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన



ఆరోగ్య జాగ్రత్తలను వివరిస్తున్న వైద్యులు

తిరుపతి అర్బన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): శ్రీబాలాజీ టూవీలర్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్కానిక్ యూత్ హస్టల్లో గురువారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. పింకీ డెంటల్ కేర్ సెంటర్, నారాయణాద్రి, మోహన్ డయాబెటిస్ ఆస్పత్రుల నుంచి వైద్య బృందం పాల్గొని దాదాపు రెండు వందల మంది మెకానిక్స్‌కు బీపీ, షుగర్, థైరాయిడ్, ఈసీజీ, డెంటల్ వంటి వైద్య పరీక్షలు చేశారు. ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు మోహన్, ఉపాధ్యక్షులు చంద్ర, కార్యదర్శి విజయహరిప్రసాద్, ట్రెజరర్ షఫీ, ఆనంద్ పాల్గొన్నారు.

గుంతల దారిలో ప్రయాణించేదెలా..!




గుంతలో చేరిన వాననీరు, కుంగిన మ్యాన్‌హోల్

తిరుపతిరూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): తిరుపతిరూరల్ మండలం గాంధీపురం పంచాయతీ ధనలక్ష్మీనగర్‌లో కొన్ని వీధుల్లో ఇప్పటికీ మట్టిరోడ్లే దర్శనమిస్తున్నాయి. పలుచోట్ల భారీ గుంతలు ఏర్పడడంతో చినుకుపడితే నీరు రోడ్డుపక్కనే నిల్వ చేరుతోంది. దీంతో అటువైపుగా ప్రయాణించే వాహనదారులు, పాదచారులు అవస్థలు పడుతున్నారు. ఇక ఇళ్లముందు గుంతల్లో నీరు చేరుతుండడంతో కాలు బయటపెట్టాలంటే ఇబ్బంది పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. కొన్నిచోట్ల యూడీఎస్ మ్యాన్‌హోల్స్ కుంగిపోవడంతో వాహనదారులు అదుపు తప్పి ప్రమాదాలకు గురవుతున్నారని అంటున్నారు.



మంత్రిని కలిసిన టీడీపీ నేతలు

తిరుపతిలో గురువారం దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని కలిసిన చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం, రాష్ట్ర కార్యదర్శి బుల్లెట్ రమణ, బీసీ నేత కృష్ణ యాదవ్ తదితరులు

గురుదక్షిణామూర్తికి పూజలు



శ్రీకాళహస్తి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో మేధో గురుదక్షిణామూర్తికి గురువారం వేదోక్తంగా పూజలు నిర్వహించారు. వినాయక కలశ పూజ వైదిక క్రతువులనంతరం స్వామివారికి వైభవంగా అభిషేకం నిర్వహించారు. సుగంధ పూలు, స్వర్ణాభరణాలతో విశేషంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. మహామంగళ హారతులు ఇచ్చారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.





తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి ఆలయం వద్ద రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, చంద్రగిరి ఎమ్మెల్యే నాని, టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి - విమానాశ్రయం వద్ద స్వాగతం పలుకుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు

జోరుగా చెరువుల అభివృద్ధి పనులు



ముళ్లపొదలు తొలగించిన తర్వాత చెన్నాయిగుంట చెరువు

తిరుపతి అర్బన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): తిరుపతి అర్బన్ మండల పరిధిలోని చెరువుల్లో ముళ్ల పొదల తొలగింపు పనులు జోరుగా సాగుతున్నాయి. మొత్తం పది ఉండగా పాన్‌చెరువు, కొర్రమేనుగుంట, పూలవానిగుంట, న్యూమంగళం చెరువు, చెన్నాయిగుంట, శెట్టిపల్లిచెరువు, అన్నాచెరువు, మంచినీళ్లగుంట చెరువులను ఆపరేషన్ అండ్ మెయింటనెన్స్ కింద ఎంపిక చేశారు. రూ.35లక్షలతో దశలవారీగా చెరువుల అభివృద్ధి పనులు చేస్తున్నారు. పాతిక రోజుల క్రితం ప్రారంభమైన ముళ్లపొదల తొలగింపు పనులు జోరుగా సాగుతున్నాయి. చెరువుల్లో, గట్టుపై ఉన్న చెట్లను, ముళ్ల పొదలను తొలగిస్తున్నారు. కాలువల శుభ్రత పనులు కూడా చేస్తున్నారు. రెండు నెలల్లో పనులు పూర్తి చేయనున్నట్లు ఇరిగేషన్ ఏఈ కవితారెడ్డి తెలిపారు. స్మార్ట్‌సిటీ నిధులతో ఇప్పటికే వినాయకసాగర్, గొల్లవానిగుంట చెరువులను శుభ్రం చేయడంతోపాటు అభివృద్ధి కూడా చేసిన విషయం తెలిసిందే.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న భవన నిర్మాణ కార్మికులు

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో కూటమి నేతలు ఇచ్చిన హామీ మేరకు సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు కోరారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. సంఘం జిల్లా నేత మునిరాజా, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జయచంద్ర మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డులో రూ.3వేల కోట్లు ఉన్నాయని, వాటిని కార్మికుల సంక్షేమం కోసం ఉపయోగించాలని కోరారు. లేనిపక్షంలో చలో విజయవాడకు శ్రీకారం చుడుతామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బాలసుబ్రహ్మణ్యం, భవన నిర్మాణ సంఘం నాయకులు శ్రీనివాసులు, శ్రీరాములు, నారాయణస్వామి, దాసు, రఫీ, ఆరీఫ్ పాల్గొన్నారు.

గర్భిణులకు పోషకాహార కిట్ల పంపిణీ



గర్భిణులకు కిట్లు అందజేస్తున్న దాతలు

తిరుపతి (కలెక్టరేట్), నవంబరు 20(ఆంధ్రజ్యోతి): యూఎస్‌ఏకు చెందిన సహృదయ ఫౌండేషన్ ఆర్థిక సాయంతో సోషల్ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో తిరుపతి రూరల్ దామినీడులో 25మంది గర్భిణులకు పోషకాహార కిట్లను గురువారం పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన దామినీడు ఆరోగ్యకేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుకన్య మాట్లాడుతూ పేదవారు ఎక్కువగా ఉన్న ఈ ప్రాంత మహిళలకు పోషకాహార కిట్లు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతినెలా వైద్య పరీక్షలు చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ బాబుకృష్ణప్రసాద్, సిర్డ్ సంస్థ కార్యదర్శి హేమశేఖర్, వలంటీర్లు అరుణ, లోకిత, నాగరత్న, రూప, సంధ్య పాల్గొన్నారు.

ఎంఈవోలకు సహిత విద్యపై శిక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న గౌరీ శంకర్‌రావు

తిరుపతి(విద్య), నవంబరు 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఎంఈవోలకు సహిత విద్యపై ఒకరోజు శిక్షణా కార్యక్రమం శుక్రవారం స్థానిక ఎస్వీజేఎస్ఎం పాఠశాలలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీఈవో కేవీఎన్ కుమార్ మాట్లాడుతూ... భవిత సెంటర్లను తరచూ పర్యవేక్షించాలని, ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ప్రభుత్వం కల్పిస్తున్న పథకాల గురించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ గౌరీ శంకర్‌రావు, సహిత విద్య సమన్వయకర్త చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ తిరుపతి, గూడూరు, పుత్తూరు, శ్రీకాళహస్తి, వెంకటగిరి, పిచ్చాటూరు, తడ మండలాలకు కొత్తగా ఏడు ఆటిజం కేంద్రాలు మంజూరయ్యాయని చెప్పారు. ఆటిజం ఉన్న పిల్లలు కూడా సమాజంలో స్వతంత్రంగా జీవించేలా చెయ్యడం మనందరి బాధ్యత అని చెప్పారు. తిరుపతి, పుత్తూరు, గూడూరు ఉప విద్యాశాఖాధికారులు, సమగ్రశిక్ష సెక్టోరియల్ అధికారులు, రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

ముగిసిన బాలల వారోత్సవాలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న రవాణాధికారి మురళీకృష్ణ

తిరుపతి అర్బన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): నగర శివారు మంగళం ప్రభుత్వ ప్రత్యేక బాలుర వసతి గృహాలలో నిర్వహించిన బాలల హక్కుల వారోత్సవాలు గురువారం ముగిశాయి. ముఖ్య అతిథిగా జిల్లా రవాణాధికారి కె.మురళీకృష్ణ పాల్గొని ప్రసంగిస్తూ పిల్లలు బాగా చదువుకుని మంచి అలవాట్లు నేర్చుకోవాలన్నారు. సమాజంలో ఉన్నత ప్రమాణాలను చేరుకోవాలని సూచించారు. అనంతరం చెస్, క్యారమ్స్, కబడ్డీ, వాలీబాల్ పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఆర్టీవో పరిపాలనాధికారి విజయ్‌కుమార్, టెక్నికల్ ఇంజనీరు రసూల్, ప్రభుత్వ ప్రత్యేక బాలుర గృహాల సూపరింటెండెంట్స్ బి.జి.కె.ఖాసిందొర, కె.వీరయ్య, డిప్యూటీ సూపరింటెండెంట్ బి.మోహన్‌బాబు పాల్గొన్నారు.

పశువులపై ఏనుగుల దాడి

భాకరాపేట, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు మండలం చిట్టేచర్ల పంచాయతీ తుమ్మచేనుపల్లె గ్రామానికి చెందిన కాలేపల్లె చంద్రశేఖర్ రెడ్డి పశువులు ఏనుగుల దాడిలో గాయపడ్డాయి. బుధవారం రాత్రి ఏనుగుల గుంపు తుమ్మచేనుపల్లె పరిసర ప్రాంతాల పంట పొలాలపై దాడులు చేశాయి. చంద్రశేఖర్ రెడ్డి తమ పశువులను పొలాల వద్దనే ఉంచారు. పొలం వద్దకు వచ్చిన ఏనుగులు వరి పైరు ధ్వంసం చేశాయి. అక్కడే ఉన్న పశువులపై దాడి చేశాయి. కొన్ని పశువులు పారిపోగా ఒక ఎద్దుకు మాత్రం తీవ్ర గాయాలయ్యాయి.

అలరించిన భక్తి సంగీతం



భక్తి సంగీతం ఆలపిస్తున్న చంద్రశేఖర్

తిరుచానూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శిల్పారామంలో గురువారం దాస సాహిత్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో నిర్వహించిన భక్తి సంగీతం అలరించింది. మహబూబ్‌నగర్‌కు చెందిన చంద్రశేఖర్‌రావు బృందం భక్తి సంగీతం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ఈకార్యక్రమంలో ఏవో సుధాకర్, ఎలక్ట్రికల్ సూపర్‌వైజర్ వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం



సంజీవరెడ్డి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ కంప్యూటర్ సైన్స్ పరిశోధకులు ఆర్.సంజీవరెడ్డి డాక్టరేట్ పొందారు. జనరేషన్ ఆఫ్ బయోజియో డేటా బేస్ ఆన్ నేచురల్ రీసోర్సెస్ ఆఫ్ తిరుమల, తిరుపతి ఫారెస్ట్ రీజియన్ యూజింగ్ రిమోట్ సెన్సింగ్ అండ్ స్పెషియల్ మైనింగ్ అండర్ జీఐఎస్ ఎ స్టడీ ఆన్ ఎకలాజికల్ మోడలింగ్ అంశంపై ప్రొఫెసర్ అంజన్‌బాబు, ప్రొఫెసర్ రామ్మోహన్‌రెడ్డి సంయుక్త పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు. సంజీవరెడ్డి ఎస్వీ ఓరియెంటల్ కాలేజీలో అధ్యాపకులుగా పనిచేస్తున్నారు.

పెరుమాళ్ మధుకు సన్మానం

తిరుపతి(జీవకోన), నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మొదలియార్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన పెరుమాళ్ మధును ఆర్టీసీ బస్టాండు వద్ద గల శ్రీవారి ఆటోస్టాండ్ యూనియన్ అధ్యక్షుడు శ్రీనివాసులు ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో యుగంధర్, శంకర, నారాయణ, రాఘవ, ఆటో స్టాండ్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.



మధును సన్మానిస్తున్న శ్రీనివాసులు, యుగంధర్




చెత్తాచెదారంతో నిండిపోయిన శ్మశానవాటిక - కర్మక్రియల నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన భవనం వద్ద పిచ్చిమొక్కలు

కొత్తపల్లి శ్మశాన వాటికలో
మౌలిక వసతులు కరువు

తిరుపతి(జీవకోన), నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని ఒకటో డివిజన్‌లో గల కొత్తపల్లి, కట్టకిందఊరు గ్రామాల శ్మశాన వాటిక అభివృద్ధికి నోచుకోలేదు. కొంక చెన్నాయగుంట, తిమ్మినాయుడుపాళెం లెక్క దాఖల 155 సర్వే నెంబరులో 2.20 ఎకరాల్లో ఉన్న ఈ శ్మశాన వాటికలో కనీస మౌలిక వసతులు లేవు. 2009లో కర్మక్రియల నిర్వహణ కోసం షెడ్డు, బోరు ఏర్పాటు చేశారు. 2013లో తిమ్మినాయుడుపాళెం పంచాయతీ తిరుపతి కార్పొరేషన్‌లో విలీనమైంది. అప్పటి నుంచి దీని గురించి పట్టించుకునే నాథుడే కరువయ్యారు. కట్టకింద ఊరు, కొత్తపల్లి, చుట్టుపక్కల కాలనీలలో ఎవరు చనిపోయినా ఇక్కడే దహనక్రియలు నిర్వహించాల్సి ఉంది. శ్మశాన స్థలమంతా చెత్తా చెదారంతో నిండిపోయి ఉంది. ఎటుచూసినా చెట్లు, ముళ్లపొదలతో డంపింగ్ యార్డును తలపిస్తోంది. ప్రహరీ లేకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయి. పశువులు, పందులు చేరి పరిసరాలను అపరిశుభ్రం చేస్తున్నాయి. కొత్తపల్లి గ్రామం నుంచి శ్మశాన వాటికకు రోడ్డు నిర్మాణం చేపట్టలేదు. చిన్నపాటి వర్షం వచ్చినా రోడ్డంతా బురద మయంగా మారుతోంది. శ్మశానవాటిక సరిగా లేకపోవడంతో కొందరు స్థానికంగా ఉన్న బావుల వద్ద కర్మక్రియలు జరుపుతున్నారు. వసతులు కల్పించాలని ఇప్పటికే అధికారులకు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినా లాభం లేకపోయింది. ఇప్పటికైనా స్పందించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



బురదమయంగా ఉన్న శ్మశాన వాటిక దారి

నవజాత శిశువుల సంరక్షణపై అవగాహన అవసరం



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు

తిరుపతి(వైద్యం), నవంబరు 20(ఆంధ్రజ్యోతి): గర్భం దాల్చినప్పటి నుంచి బిడ్డపుట్టే వరకు పాటించాల్సిన జాగ్రత్తలపై తల్లులు అవగాహన కలిగి ఉండాలని రుయా చిన్నపిల్లల విభాగాధిపతి డాక్టర్ మనోహర్ అన్నారు. నవజాత శిశు వారోత్సవాల్లో భాగంగా ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి, రుయా చిన్నపిల్లల విభాగం ఆధ్వర్యంలో చిన్నపిల్లల విభాగ ఆవరణలో గురువారం నవజాత శిశు సంరక్షణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవజాత శిశు మరణాలను పూర్తిగా నివారించాలంటే బిడ్డ కడుపులో పడినప్పటి నుంచే ఎటువంటి ఆహారం తీసుకోవాలి, ఎలాంటి వైద్య పరీక్షలు చేయించుకోవాలనే విషయాలను తల్లులు తెలుసుకోవాలన్నారు. అనంతరం గర్భిణులు, బాలింతలు పాటించాల్సిన అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రసూతి ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రమీల, వైద్యాధికారులు జయచంద్ర నాయుడు, అంజన్‌కుమార్, నోడల్ అధికారులు ధనశేఖర్, శశికుమార్, నాగరమణి, మోనిక పాల్గొన్నారు.

జీవన మార్గాన్ని నిర్దేశించిన శుద్ధాద్వైతం

సంస్కృత వర్సిటీ మాజీ వీసీ హరేకృష్ణ శతపథి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మనిషి జీవితానికి స్పష్టమైన లక్ష్యముందని వల్లభాచార్యులు ప్రతిపాదించిన శుద్ధాద్వైతం చెబుతుందని సంస్కృత యూనివర్సిటీ మాజీ వీసీ హరేకృష్ణ శతపథి పేర్కొన్నారు. మహామహోపాధ్యాయ పట్టాభిరామ శాస్త్రి వ్యాఖ్యానమాలలో భాగంగా వల్లభాచార్యులు శుద్ధాద్వైత వాదంపై ఉపన్యాస కార్యక్రమంలో గురువారం ఆయన పాల్గొని మాట్లాడారు. వల్లభాచార్యుల శుద్ధాద్వైత వేదాంతం గురించి ఈ తరం తెలుసుకోవాలన్నారు. మాయా ప్రపంచంలోని మనిషి జీవనానికి ఒక నిర్దిష్ట లక్ష్యం ఉందని, ప్రతి ఒక్కరూ వారి జీవితంలో దాన్ని సాధించాలనే తత్త్వం ఇందులో ఉందని అన్నారు. సంస్కృత వర్సిటీ వీసీ కృష్ణమూర్తి మాట్లాడుతూ వ్యాఖ్యానాల ద్వారా విద్యార్థుల్లో శాస్త్ర జ్ఞానంతోపాటు సృజనాత్మక శక్తి పెరుగుతుందన్నారు. వ్యాఖ్యానమాల ద్వారా వివిధ శాస్త్రాల్లో ఉన్న జ్ఞానాన్ని సంపాదించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



హరేకృష్ణ శతపథిని సత్కరిస్తున్న వీసీ కృష్ణమూర్తి

రాష్ట్రపతికి స్వాగతం పలికిన ఎంపీ



తిరుపతి పర్యటన నిమిత్తం గురువారం విచ్చేసిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు విమానాశ్రయంలో ఎంపీ గురుమూర్తి స్వాగతం పలికారు. - తిరుపతి(జీవకోన)

ఎముకల సాంద్రత పరీక్షలు తప్పనిసరి



రోగులకు బీఎండీ పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ సుకుమార్

తిరుపతి(వైద్యం), నవంబరు 20(ఆంధ్రజ్యోతి): 40 ఏళ్లు దాటిన వారు మూడు నెలలకొకసారి ఎముకల సాంద్రత(బీఎండీ) పరీక్షలు చేయించుకోవాలని, అప్పుడే తగిన వైద్యం పొందవచ్చని ప్రముఖ కీళ్లనరముల వైద్య నిపుణులు డాక్టర్ సుకుమార్ అన్నారు. స్థానిక రెడ్డి అండ్ రెడ్డి కాలనీలోని శ్రీసాయి సుధా ఆస్పత్రిలో గురువారం ముంబయికి చెందిన ఇంటస్ ఫార్మా లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. రోగులకు ఉచితంగా బీఎండీ పరీక్షలు నిర్వహించారు. అవసరమైన మందులను ఉచితంగా అందించారు. ఎముకల్లో కాల్షియం తగ్గడం వల్ల కలిగే నష్టాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. డాక్టర్లు సుబ్బానాయుడు, వినయ్‌కుమార్, హిమబిందు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

తిరుపతి(జీవకోన), నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ విరమణ పొందిన రైల్వే, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల పెన్షన్ రివిజన్ అత్యంత కీలక అంశమని, ఈ సమస్యను వెంటనే పరిష్కరించేందుకు కృషి చేయాలని తిరుపతి సీఆర్ఎస్ పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం ఎంపీ గురుమూర్తిని కలిసి వినతి పత్రం అందజేశారు. 2026 సంవత్సరానికి ముందు ఉద్యోగ విరమణ చేసిన వారిని టర్మ్స్‌ఆఫ్ రెఫరెన్స్‌లో చేర్చకపోవడంతో వస్తున్న సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేలా కృషి చేయాలన్నారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీ తెలిపారు.

కంకణాలకు సత్కారం



రజినీకాంత్ నాయుడికి శుభాకాంక్షలు తెలుపుతున్న డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ తదితరులు

తిరుపతి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): తెలుగు యువత అధికార ప్రతినిధి కంకణాల రజినీకాంత్ నాయుడు జన్మదినం సందర్భంగా తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ తన చాంబర్‌లో కేక్ కట్ చేసి, చిత్రపటం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు మస్తాన్ నాయుడు, రావూరి ఉమాశంకర్, ఎస్కే శ్రీధర్, సుబ్బు యాదవ్, గంజి సుధాకర్ రెడ్డి, నాగ ప్రతాప్, జలపోతు చంద్ర, ముని, దేవా, జగ్గా పాల్గొని ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

మెకానిక్‌లకు ఆర్థిక సాయం

తిరుపతి(జీవకోన)నవంబరు 20(ఆంధ్రజ్యోతి): అనారోగ్యం బారిన పడిన ఇద్దరు మెకానిక్‌ల వైద్య ఖర్చుల నిమిత్తం టూవీలర్స్ మెకానిక్ అసోసియేషన్ అధ్యక్షుడు మునిరెడ్డి ఆధ్వర్యంలో గురు వారం రూ.20వేలు అందజేశారు. గాంధీ భవన్‌లో నిర్వహించిన అసోసియేషన్ సమావేశంలో వారికి ఈ మొత్తం అందజేశారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు జలంధర్, ఉపాధ్యక్షుడు ప్రభు, కార్యదర్శి గురు ఆచారి, కోశాధికారి బాబు, సంయుక్త కార్యదర్శి తేజరెడ్డి, కమిటీ ఇన్‌ఛార్జి కేశవ, సభ్యులు మురుగ, నాగరాజు, రాము పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న మునిరెడ్డి



ఎంవోయూను టీటీడీ ఇంజినీరింగ్ అధికారులకు అందజేస్తున్న ట్రస్టు ప్రతినిధులు

8 నుంచి అలిపిరి పాదాలమండపం పనులు

తిరుమల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అలిపిరి పాదాల మండపం పునరుద్ధరణ పనులు డిసెంబరు 8 నుంచీ మొదలు కానున్నాయి. ఇందుకు సంబంధించిన ఎంవోయూ గురువారం టీటీడీ, లార్డ్ వేంకటేశ్వర ఛారిటబుల్ అండ్ రిలీజియన్స్ ట్రస్టు మధ్య జరిగింది. పూణేకు చెందిన ట్రస్టు నిర్వాహకులు వెంకటేశ్వరరావు ఈపాదాల మండపాన్ని దాదాపు రూ.4 కోట్ల వ్యయంతో పునర్నిర్మాణం కోసం ముందుకు వచ్చారు. సంతకం చేసిన ఎంవోయూ పత్రాలను ట్రస్టు ప్రతినిధులు గురువారం టీటీడీ ఇంజినీరింగ్ అధికారులకు అందజేశారు.



శ్రీవారిసేవలో మంత్రి అచ్చెన్నాయుడు

తిరుమల, నవంబరు20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు గురువారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. రంగనాయకమండపంలో మంత్రికి వేదపండితులు ఆశీర్వచనం చేయగా, టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి లడ్డూ ప్రసాదాలు అందజేశారు. అలాగే సినీ నిర్మాత దిల్ రాజు సతీమణి తేజశ్విని కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.

→ అచ్చెన్నాయుడికి ప్రసాదాలు అందజేస్తున్న అదనపు ఈవో


సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 4 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని ఒక షెడ్‌లో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

మంగళవారం హుండీ ఆదాయం: రూ.4.75 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 67,121

తలనీలాలు సమర్పించినవారు: 22,426





తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం వాహన సేవల ముందు విభిన్న సంస్కృతులు, కళాప్రదర్శనలు భక్తుల మనసును దోచాయి. రాత్రి జరిగిన హనుమంత వాహన సేవ ముందు.. ఫ్యూజన్ క్లాసికల్, కోలాటం, అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఆండాల్ వైభవం, చెక్కభజన, అమరావతి డ్రమ్స్, కోలాటం, ఎస్వీ సంగీత , నృత్య కళాశాల ఆధ్వర్యంలో శ్రీరామపట్టాభిషేకం, భరత నాట్యం, నెమలినృత్యం, దాస ప్రాజెక్టు ఆధ్వర్యంలో అష్టలక్ష్మి వైభవం, తాళం డ్యాన్స్, కోలాటం ఆకట్టుకున్నాయి.
హనుమంత వాహనసేవలో మొత్తం 15 కళాబృందాలు ప్రదర్శనలు చేశాయి.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి

నేడు అమ్మవారికి గజవాహనసేవ



మాడవీధుల్లో తొక్కిసలాట జరగకుండా ఏర్పాటు చేసిన క్యూలైన్లు

తిరుచానూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతి అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి గజవాహన సేవ జరగనుంది. తిరుమలలో శ్రీవారి గరుడసేవకున్న ప్రాముఖ్యత.. తిరుచానూరులో గజవాహనసేవకు ఉంటుంది. తిరుపతి నగరంతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు గజవాహన సేవ తిలకించేందుకు పెద్దసంఖ్యలో తరలివస్తారు. దీంతో మాడవీధుల్లో ఎలాంటి తొక్కిసలాటలు, తోపులాటలు చోటుచేసుకోకుడా టీటీడీ ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేసింది. టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో మురళీకృష్ణ ఆలయ మాడవీధుల్లో గజవాహన సేవ ఏర్పాట్లు పరిశీలించారు. ఎక్కడా భక్తులు ఇబ్బంది పడకుండా పోలీసు, విజిలెన్సు సమన్వయంతో పనిచేయాలన్నారు. భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. స్కౌట్స్ అండ్ గైడ్స్, శ్రీవారి సేవకుల సేవలను వినియోగించుకుంటున్నారు. ప్రతిరోజు వాహన సేవలు రాత్రి 9 గంటలకు ముగిస్తే, గజ, గరుడ వాహనసేవలకు మాత్రం రాత్రి 11గంటల వరకు వాహనసేవ కొనసాగే అవకాశం ఉంది.

తిరుమల నుంచి నేడు లక్ష్మీకాసుల హారం రాక

గజవాహన సేవ నేపథ్యంలో అమ్మవారికి అలంకరించేందుకు తిరుమలలో శ్రీవారికి అలంకరించే సహస్ర లక్ష్మీకాసుల హారాన్ని శుక్రవారం ఉదయం తీసుకురానున్నారు. ఈ హారాన్ని శోభాయాత్రగా తీసుకొచ్చి.. గజవాహన సేవలో అమ్మవారికి అలంకరిస్తారు.

అన్యమత చిహ్నాలతో తిరుమలకు వాహనం

● అలిపిరి భద్రతా ఉద్యోగిపై చర్యలు



తిరుమల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అన్యమత చిహ్నాలతో ఉన్న వాహనాన్ని గుర్తించి అడ్డుకోవడంలో నిర్లక్ష్యం వహించారంటూ అలిపిరి టోల్ సిబ్బంది ఒకరిని విధుల నుంచి టీటీడీ తొలగించింది. టీఎన్ 31 ఏఈ 4073 నెంబరు గల టెంపో ట్రావెలర్ గురువారం అలిపిరి దాటి నిరాటంకంగా తిరుమలకు చేరుకుంది. ఫైర్‌స్టేషన్‌కు వెనుక పార్కింగ్‌లో ఉన్న తమిళనాడుకు చెందిన ఈ వాహనంలో అన్యమత చిహ్నం, స్టిక్కర్‌తో ఉండడాన్ని కొందరు గుర్తించి విజిలెన్స్, మీడియాకు సమాచారమిచ్చారు. విజిలెన్స్ సిబ్బంది అక్కడకు చేరుకుని అన్యమత చిహ్నాలను తొలగించారు. కాగా అలిపిరి తనిఖీ కేంద్రంలోని తొమ్మిదోలైన్ నుంచి వాహనం వచ్చిందని గుర్తించి, అక్కడ విధుల్లో ఉన్న వాసు అనే భద్రతా ఉద్యోగిని తొలగించి, శాఖాపరమైన చర్యలు తీసుకున్నామని టీటీడీ తెలిపింది. వాహన డ్రైవర్ గోబి, యజమానిపై కేసు నమోదు చేశారు.

రాష్ట్రపతి పర్యటనకు పటిష్ఠ బందోబస్తు





పోలీసు ఆంక్షలతో నిర్మాన్యుష్యంగా ఉన్న పద్మావతి అమ్మవారి ఆలయ పరిసర వీధులు - కలెక్టరేట్ వద్ద హైవేపై ఆగిన వాహనాలు

తిరుచానూరు/తిరుమల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పర్యటన సందర్భంగా గురువారం పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ ఆంక్షలతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు. రేణిగుంట విమానాశ్రయం వద్ద ఉన్న టాక్సీలను ఉదయం నుంచీ పార్కింగ్‌లోకి తరలించారు. టాక్సీ బుకింగ్ కౌంటర్ల వద్ద ఎవరినీ అనుమతించలేదు. ఇక, మధ్యాహ్నం 3 గంటల తర్వాత హైవే నుంచి అమ్మవారి ఆలయం వరకున్న మార్గంలో రాకపోకలను నిషేధించారు. తిరుపతి నుంచి తిరుచానూరుకు యధావిధిగా రాకపోకలకు అనుమతించారు. ఆలయ సన్నిధి వీధిలోనూ దాదాపు రెండు గంటల పాటు ఎవరినీ రానీయలేదు. అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులను సాయంత్రం 4గంటల వరకు అనుమతించి.. ఆపై ఆపేశారు. రాష్ట్రపతి అమ్మవారిని దర్శించుకుని తిరుమలకు బయలుదేరాక భక్తులను యథావిధిగా అనుమతించారు. రాష్ట్రపతి రాక సందర్భంగా జాతీయ రహదారిలో కొంతసేపు ఇరువైపులా వాహన రాకపోకలను పోలీసులను నిలిపివేశారు. అక్కడక్కడ ట్రాఫిక్ జామ్ అయింది. ఇక, తిరుమలలోనూ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. రాష్ట్రపతి బస చేసే అతిథిగృహం వద్ద పటిష్ఠ భద్రతను కల్పించారు. పాసులున్న అధికారులు, సిబ్బంది మినహా మిగతా ఎవరూ ఆ ప్రాంతంలోకి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. అలాగే రాష్ట్రపతి కాన్వాయ్ ప్రయాణించే మార్గాల్లోనూ భద్రతను కట్టుదిట్టం చేశారు. కాన్వాయ్ రావడానికి ముందే దుకాణాలు మూసివేయాలనే ఆదేశాలు జారీ చేశారు.

సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు సహకరిస్తాం

● కుప్పం నియోజకవర్గ ప్రజలు ముందుకు రావాలన్న సదరన్ డిస్కం సీఎండీ



సోలార్ విద్యుత్ ప్లాంటును పరిశీలిస్తున్న సదరన్ డిస్కం సీఎండీ శివశంకర్

శాంతిపురం/తిరుపతి(ఆటోనగర్), నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కుప్పం నియోజకవర్గంలో సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు ప్రజలు ముందుకు వస్తే పూర్తి సహకారం అందిస్తామని సదరన్ డిస్కం సీఎండీ శివశంకర్ అన్నారు. శాంతిపురం మండలం అబకలదొడ్డి గ్రామంలో సోలార్ విద్యుత్ ప్లాంట్ నిర్మాణ పనులను గురువారం ఆయన పరిశీలించారు. సూర్యఘర్ యోజనలో భాగంగా ఎస్సీ, ఎస్టీలకు రూఫ్ టాప్ సోలార్ సిస్టమ్స్ పనులు, బల్ల వద్ద నిర్మాణ దశలో వున్న 33-11 కేవీ సబ్‌స్టేషన్ పనులను పరిశీలించారు. గృహాలపై జరుగుతున్న సోలార్ విద్యుత్ ప్లాంట్ నిర్మాణపనుల తీరును చూశారు. ఈ పథకం అమలుతో కలిగే ప్రయోజనాలను తమ సిబ్బంది వివరించారా అని గృహ యజమానులను అడిగారు.సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు త్వరిత గతిన పూర్తి చేయాలని ఆదేశించారు. పీఎం కుసుం పథకం కింద ఫీడర్ లెవల్ సోలరైజేషన్ పనుల్లో భాగంగా 4.9 మెగావాట్ల సామర్థ్యంతో ఏర్పాటు చేస్తున్న సోలార్ ప్లాంట్ పనుల్లో వేగం పెంచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ ప్లాంట్ పూర్తి చేస్తే రైతులకు మెరుగైన విద్యుత్ సరఫరా అందించే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సదరన్ డిస్కం డైరెక్టర్ పి.అయూబ్‌ఖాన్, రెస్కో ఎండీ ఎస్.సోమశేఖర్, చిత్తూరు ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్, ఈఈ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఛాతీ భాగంలో చొచ్చుకుపోయిన ఇనుపరాడ్డు

● శస్త్ర చికిత్సతో రాడ్డును తొలగించిన రుయాస్పత్రి వైద్యులు



పది రోజుల కిందట బాధితుడి ఛాతీభాగంలో చొచ్చుకుపోయిన ఇనుపరాడ్డు

తిరుపతి(వైద్యం), నవంబరు 20(ఆంధ్రజ్యోతి): 'ఓ వ్యక్తి ఛాతీ భాగానికి రెండు వైపులా 1.5 మీటర్ల ఇనుపరాడ్డు చొచ్చుకుపోయింది. అతిక్లిష్టమైన శస్త్రచికిత్సతో ఆ రాడ్డును తొలగించి ఆ వ్యక్తి ప్రాణాలు నిలబెట్టడం గొప్ప విషయం' అని రుయా సూపరింటెండెంట్ డాక్టర్ రాధ అన్నారు. తిరుపతిలోని రుయాస్పత్రిలో గురువారం ఆమె మీడియాతో మాట్లాడారు. 'అనంతపురానికి చెందిన షేక్ వల్లి(44) ద్విచక్ర వాహనంపై దుస్తులు అమ్ముకుంటూ శ్రీకాళహస్తిలో స్థిరపడ్డారు. పదిరోజుల కిందట దుస్తుల వ్యాపార నిమిత్తం నగరికి వెళ్లి తిరిగి పుత్తూరుకు వస్తున్నారు. ఈ క్రమంలో రహదారిపై బస్సును అధిగమించబోయి ద్విచక్ర వాహనం అదుపుతప్పి బ్రిడ్జి పైనుంచి కింద పడ్డారు. ఆ సమయంలో బ్రిడ్జి నిర్మాణ పనులు జరుగుతుండటంతో అక్కడ ఏర్పాటు చేసివున్న 1.5 మీటర్ల ఇనుపరాడ్డు అతని ఛాతీ భాగంలో ఒక వైపు గుచ్చుకొని మరో వైపు బయటకు వచ్చింది. అదే సమయంలో అటుగా వెళ్లే కొందరు 108 అంబులెన్సుకు సమాచారం ఇవ్వడంతో వారు ఆయన్ను రుయాస్పత్రికి తీసుకొచ్చారు. ఆ సమయంలో బాధితుడు స్పృహలో లేకపోవడం, అతడి వివరాలు వెల్లడించేందుకు కుటుంబ సభ్యులూ లేరు. బాధితుడి పరిస్థితి చూసి రుయాస్పత్రిలోని కార్డియోథొరాసిక్, అనస్థీషియా, సర్జరీ విభాగాల వైద్యాధికారులు హుటాహుటిన శస్త్రచికిత్సను ప్రారంభించారు. దాదాపు రెండు గంటలు శ్రమించి అత్యంత క్లిష్టమైన శస్త్రచికిత్సను చేసి వ్యక్తి శరీరంలో ఊపిరితిత్తులకు, గుండెకు మధ్యలో చొచ్చుకుపోయిన ఇనుపరాడ్డును తొలగించి బాధితుడి ప్రాణాలు నిలబెట్టారు. శస్త్ర చికిత్స అనంతరం పది రోజులుగా షేక్ వల్లిని వైద్యుల పర్యవేక్షణలో ఉంచారు. పూర్తి ఆరోగ్యంగా కోలుకున్న తర్వాత గురువారం ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేశాం' అని ఆమె తెలిపారు. సూపర్ స్పెషాలిటీ వైద్య సేవల్లో అనుభవం కలిగిన వైద్యనిపుణులు కళ్యాణి రమ, గౌతమి, పద్మ, శ్రీనివాసులు, జ్ఞాపిక, రవిశంకర్ బృందం ఈ శస్త్ర చికిత్సను విజయవంతం చేసి రుయాస్పత్రి స్థాయిని మరింత పెంచారని ఆమె అభినందించారు. పూర్తి ఉచితంగా నిర్వహిస్తున్న ఇటువంటి సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను రోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తన ప్రాణాలు నిలబెట్టిన వైద్యులకు షేక్ వల్లి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ఎంవో డాక్టర్ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



శస్త్ర చికిత్స చేసిన వైద్య బృందం

25న వెంకటగిరిలో జాబ్‌మేళా

వెంకటగిరి, నవంబర్ 20(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి పట్టణంలోని విశ్వోదయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 25వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను టీడీపీ కార్యాలయంలో గురువారం ఆవిష్కరించారు. శ్రీసిటీ, మేనకూరు సెజ్, ఈఎంసీ క్లస్టర్, తిరుపతి, చెన్నైలోని 14 బహుళ జాతి కంపెనీల్లో 720 పైగా ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కురుగొండ్ల పిలుపునిచ్చారు. విశ్వోదయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ అధికారి డాక్టర్ మాల్యాద్రి మాట్లాడుతూ పదవ తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణులైన వారు జాబ్‌మేళాకు హాజరు కావచ్చని తెలిపారు. అభ్యర్థులు హెచ్‌టిటిపిఎస్-ఎన్ఏజేపియూఎన్‌వైఎఎం.ఎపి.జీవోవి.ఇన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. వివరాలకు 7013509543, 9491458910, 9988853335 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

గ్రంథాలయాలు.. విజ్ఞాన భాండాగారాలు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్, పక్కన లైబ్రేరియన్ శ్రీనివాసులు

సూళ్లూరుపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుని విజ్ఞానవంతులు కావాలని మున్సిపల్ మేనేజర్ పి.శ్రీనివాస్ అన్నారు. గురువారం సూళ్లూరుపేట గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ ప్రాథమిక దశ నుంచే విద్యార్థులు గ్రంథాలకు వెళ్లి గ్రంథాలు, మంచి పుస్తకాలు చదవడం అలవర్చుకోవాలన్నారు. చదువుతో విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించేందుకు గ్రంథాలయాలు ఎంతో ఉపయోగపడతా యన్నారు. లైబ్రేరియన్ శ్రీనివాసులు మాట్లాడుతూ వినూత్న ఆలోచనతో నూతన ఒరవడిని సృష్టించేందుకు, సంస్కారవంతమైన జీవితానికి గ్రంథా యాలు దోహదం చేస్తాయన్నారు. అనంతరం వివిధ పోటీల్లో రాణించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో లైబ్రరీ సిబ్బంది వంకా శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలు, హక్కులపై అవగాహన కలిగి ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీవో మునికుమారి

కోట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): చట్టాలు, హక్కులపై బాలికలు, మహిళలు అవగాహన కలిగి ఉండాలని సీడీపీవో మునికుమారి అన్నారు. కోటలోని ప్రగతి డిగ్రీ కళాశాల, జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలల్లో గురువారం జాతీయ బాలల హక్కుల దినోత్సవంలో భాగంగా బాలికలకు చట్టాలు, హక్కులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీడీపీవో మునికుమారి మాట్లాడుతూ సమాజంలో మహిళాసాధికారిత, మహిళల రక్షణ కోసం అమలులోకి ఉన్న చట్టాల గురించి వివరించారు. అలాగే పోక్సో చట్టం, బాల్యవివాహాల నిర్మూలన గురించి అవగాహన కల్పించారు. 1098, 181, 112, హెల్ప్‌లైన్ నెంబర్ల ప్రాముఖ్యతను వివరించారు. బాలికలకు క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ కృష్ణమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి ఆర్చరీ పోటీలకు విద్యార్థి ఎంపిక



వెంకటలోకేశ్‌ను అభినందిస్తున్న కళాశాల సిబ్బంది

గూడూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లయోలా జూనియర్ కళాశాల విద్యార్థి వెంకటలోకేశ్ జాతీయస్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపికయ్యాడని కరస్పాండెంట్ పంటా శ్రీనివాసులురెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఇటీవల విజయవాడలో జరిగిన సబ్ జూనియర్ ఇండియన్ రౌండ్ రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీల్లో వెంకటలోకేశ్ ప్రతిభ చాటి గోల్డ్‌మెడల్ సాధించాడని చెప్పారు. అలాగే రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ పోటీల్లో సిల్వర్‌మెడల్, ఇండియన్ జూనియర్, సీనియర్ పోటీల్లో గోల్డ్‌మెడల్ సాధిండన్నారు. ఈనెల 24నుంచి 30వ తేదీ వరకు అరుణాచల్‌ప్రదేశ్‌లో జరగనున్న జాతీయస్థాయి ఆర్చరీ పోటీల్లో పాల్గొంటాడని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



ప్రతిభా పురస్కారాలతో విద్యార్థులు

గూడూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక కేశవ నిలయంలో గురువారం పట్టణంలోని పలు పాఠశాలు, కళాశాలల్లో ప్రతిభచాటిన విద్యార్థులకు ఏబీవీపీ ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకులు మాట్లాడుతూ విద్యార్థులను చదువుల్లో ప్రోత్సహించేందుకు ఏటా ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్నామన్నారు. విద్యార్థులు చదువుతో పాటు దేశభక్తిని పెంపొందించు కోవాలన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు మల్లికార్జున, సత్యనారాయణ, మనోజ్ కుమార్, రైల్వేస్టేషన్ మేనేజర్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు విద్యార్థుల అప్పగింత

గూడూరు అర్బన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాల విద్యార్థులు అదృశ్యం కావడంతో వారి ఆచూకీ తెలుసుకుని తల్లిదండ్రులకు అప్పగించినట్లు రూరల్ ఎస్ఐ తిరుపతయ్య తెలిపారు. పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న శివసాయి, అక్షిత్ గురువారం వాష్‌రూంకు వెళ్లి వస్తామని ఉపాధ్యాయుడుకి చెప్పి ప్రహరీ దూకి బయటకు వెళ్లిపోయారు. యాజమాన్యం పరిసర ప్రాంతాల్లో గాలించినా వారు కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన పోలీసులు రైల్వేస్టేషన్‌లోని సీసీ కెమెరాలను పరిశీలించారు. స్టేషన్‌లోని 4 నంబరు ప్లాట్‌ఫాంలో చెన్నై వెళ్లే రైలులో ఉన్న ఇద్దరు విద్యార్థులను గుర్తించారు. వారిని తీసుకువచ్చి తల్లిదండ్రులకు అప్పగించినట్లు ఎస్ఐ తిరుపతయ్య తెలిపారు.

ఆధార్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోండి

ఓజిలి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఓజిలిలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో నారాయణ రెడ్డి అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఓజిలి సచివాలయంలో ఏర్పాటు చేసిన ఆధారం కేంద్రంలో ఈనెల 27 వరకు సేవలు అందిస్తామన్నారు. ఆధార్ లేని పిల్లలకు నమోదు చేయించాలని తలిదండ్రులకు సూచించారు.

రోడ్డుకు మరమ్మతులు చేయండి



అండర్‌బ్రిడ్జి కింద దెబ్బతిని గుంతలు పడిన రోడ్డు

గూడూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శాంతినగర్ రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద రోడ్డును బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు. అండర్‌బ్రిడ్జి వద్ద రోడ్డు దెబ్బతిని గోతులు ఏర్పడడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో రోడ్డుపై నీరునిల్వ చేరి ప్రమాదాలకు కారణమవుతోందని చెబుతున్నారు. ప్రధానంగా గూడూరు ఒకటో - రెండో పట్టణాల ప్రజలు ఈ బ్రిడ్జి కింద రోడ్డులోనే రాకపోకలు సాగిస్తుంటారు. అలాగే నెల్లూరు వైపు నుంచి బనిగిసాహెబ్‌పేట మీదుగా ఈ అండర్‌బ్రిడ్జి ద్వారానే తిరుపతి, వెంకటగిరి, రాపూరు మార్గాలకు వెళ్లే వాహనాలు ప్రయాణిస్తుంటాయి. అధికారులు స్పందించి నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

సమయపాలన పాటించకుంటే చర్యలు: కురుగొండ్ల



ఆస్పత్రిలో వైదుడితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, నవంబర్ 20(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో సమయపాలన పాటించకపోతే ఎంతటి వారైనా చర్యలు తప్పవని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ హెచ్చరించారు. గురువారం స్థానిక ప్రభుత్వాస్పత్రికిని ఆయన తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు, రోగులకు అందిస్తున్న సేవలు, మందుల లభ్యత, పరిసరాల శుభ్రతను పరిశీలించారు. రోగులతో మాట్లాడి వారికి అందుతున్న చికిత్స గురించి ఆరా తీశారు. డాక్టర్లు సమయానికి అందుబాటులో ఉన్నారా? లేదా? అని అడిగి తెలుసుకొన్నారు. ఆస్పత్రిలో కొన్ని గదులకు తాళం వేసి ఉండటాన్ని గమనించిన ఎమ్మెల్యే సిబ్బందిని ప్రశ్నించారు. గదుల తాళాలు తమ వద్ద లేవని, ఇన్‌చార్జి డాక్టర్ జిలానీ భాషా దగ్గర ఉన్నాయని, ఆయన సెలవుపై వెళ్లారని సిబ్బంది చెప్పారు. దీనిపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆస్పత్రిలో గదులకు తాళాలు వేసి ఇంటికి తీసుకెళ్లడానికి ఆయన ఆయన సొంత ఆస్తా, ఈ విషయంపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని చెప్పారు. అనంతరం కురుగొండ్ల మాట్లాడుతూ డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. అలాగే అసంపూర్తిగా ఉన్న ట్రామాకేర్ సెంటర్ పనులకు అవసరమైన నిధులు మంజూరు చేయించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అనిల్ రెడ్డి, పక్కన ఎంపీడీవో మురళీకృష్ణ

సూళ్లూరుపేట, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీపీ అల్లూరు అనిల్ రెడ్డి అన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీ సీజన్ ప్రారంభమైందని, రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో యూరియా అందించేలా వ్యవసాయాధికారులు చొరవ తీసుకోవాలన్నారు. పట్టాదారు పాసు పుస్తకాలతో సంబంధం లేకుండా పంటలు సాగుచేసే రైతులందరికీ యూరియా అందింఆలని కోరారు. వర్షాకాలంలో విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు లేకుండా ఆ శాఖ అధికారులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో గ్రామాల్లో పక్కాగృహాల మంజూరుకు అర్హులను గుర్తించాలన్నారు. ఎంపీడీవో మురళీకృష్ణ మాట్లాడుతూ ఇంటి పన్నులు సకాలంలో చెల్లించేందుకు సర్పంచ్‌లు బాధ్యత తీసుకోవాలని కోరారు. అలాగే గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టిపెట్టాలని, తాగునీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఏవో కాంచన, సీడీపీవో జ్యోతికిరణ్, పేర్నాడు వైద్యాధికారిణి జయశ్రీ, గృహనిర్మాణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు సత్యనారాయణ, భవాని, ఏపీఎం ప్రసన్న, ఏపీవో లక్ష్మీనారాయణ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ముంపు పొలాలను కాపాడండి



వీఆర్వో బాబుకు వినతిపత్రం సమర్పిస్తున్న రైతులు

తడ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ముంపు పొలాలను కాపాడాలంటూ వేనాడు పంచాయతీ ఆలపత్రి రైతులు రెవెన్యూ అధికారులను వేడుకున్నారు. గురువారం తహసీల్దారును కలిసేందుకు వెళ్లగా ఆయన లేకపోవడంతో వీఆర్వో బాబుకు వినతిపత్రం అందజేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు పొలాల్లో నీళ్లు చేరాయని, అవి దిగువ పొలాల మీదుగా పులికాట్‌లో కలవాల్సి ఉందని, కాని కొందరు రైతులు అడ్డుకట్టవేయడంతో పంటలు నీట మునిగాయన్నారు. సుమారు 100 ఎకరాలకు పైగా వరిపంట పాచిపోయే పరిస్థితికి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని తహసీల్దారు దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కరిస్తామని వీఆర్వో బాబు చెప్పారు.

గోవిందపల్లిపాళెంలో సాగర్ కవాచ్



గోవిందపల్లిపాళెంలో మెరైన్ ఎస్ఐ శివసామ్య, సిబ్బంది

కోట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గోవిందపల్లిపాళెం, శ్రీనివాససత్రం మత్స్యకార గ్రామాల్లో గురువారం మెరైన్ పోలీసుల ఆధ్వర్యంలో సాగర్ కవాచ్ జరిగింది. మెరైన్ సీఐ నారాయణరెడ్డి, ఎస్ఐ శివసామ్య, ఏఎస్ఐ రాధమ్మ ఆధ్వర్యంలో పోలీసులు సాగర్‌తీరంలో కవాతు నిర్వహించారు. సముద్రం నుంచి చొరబాటుదారుల కదలికలపై నిఘా ఉంచారు. సముద్రంలోకి గుర్తు తెలియని బోట్‌లు, స్టీమర్ల రాకను ఎప్పటికప్పుడు గుర్తించి సమాచారం అందివ్వాలని మత్స్యకారులను కోరారు.

కోనేరులో కార్తీక దీపాలు



కోనేరులో కార్తీక దీపాలు వదులుతున్న మహిళలు

గూడూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం చివరి రోజున స్థానిక కోనేటిమిట్టలోని ఆంజేయస్వామి తెప్పకోనేరులో మహిళలు కార్తీక దీపాలను వెలిగించారు. నెలరోజుల పాటు కార్తీక మాసంలో కార్తీక పూజలు జరిపారు. గురువారం చివరిరోజు కావడంతో మహిళలు కోనేటి వద్దకు చేరు కుని ఆవునెయ్యి, నువ్వుల నూనెతో వెలిగించిన దీపాలను అరటి బొదెలపై ఉంచి నీటిలోకి వదిలి పూజలు జరిపారు. అనంతరం కోదండ రామాంజ నేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

శ్మశాన భూమి ఆక్రమణపై ఫిర్యాదు

కోట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తిమ్మానాయుడుపాళెంలో గిరిజనులకు చెందిన శ్మశాన భూమి ఆక్రమణపై మాజీ సర్పంచ్ ఆనందయ్య ఆధ్వర్యంలో గిరిజనులు గురువారం తహసీల్దారు జయజయరావుకు ఫిర్యాదు చేశారు. గిరిజనుల శ్మశాన భూమి కొందరు ఆక్రమించారని చెప్పారు. కాలనీలో ఎవరైనా చనిపోతే పూడ్చేందుకు ఇబ్బందులు పడుతున్నామన్నారు. శ్మశానవాటిక ఆక్రమణను తొలగించాలని తహసీల్దారును గిరిజనులు కోరారు.

వైసీపీ సంతకాల సేకరణ

సూళ్లూరుపేట, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశా లల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ సూళ్లూరుపేట పట్టణంలోని గణపతి నగర్‌లో గురువారం వైసీపీ నేతలు సంతకాల సేకరణ చేప ట్టారు. మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, వైసీపీ పట్టణ అధ్యక్షుడు కృపాకర్ రెడ్డి, ఎంపీపీ అల్లూరు అనిల్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్లు చిన్న సత్యనారాయణ, పోలూరు పద్మ, కౌన్సిలర్ మీజూరు రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యాకమిటీ ఎన్నిక ఏకగ్రీవం



చైర్మన్, వైస్ చైర్మన్లను అభినందిస్తున్న ఎంఈవో, టీడీపీ నేతలు

కోట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెద గోవిందపల్లి ఉన్నత పాఠశాల స్కూల్ మెనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు గురువారం ఏకగ్రీవంగా జరిగాయి. ఎంఈవో మస్తానయ్య, హెచ్‌ఎం పార్వతిప్రవీణ ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రులు నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చైర్మన్‌గా ఐ.వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్‌గా టి.స్వాతితో పాటు మరో 15మంది సభ్యులను ఎన్నుకున్నారు. నూతన కమిటీని ఎంఈవో మస్తానయ్య, టీడీపీ నాయకులు చెంగల్‌రావు, బాలకృష్ణగౌడ్, మురళి అభినందించారు.

అయ్యప్పస్వామి గ్రామోత్సవం



కోట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణంలో గురువారం అయ్యప్పస్వామి గ్రామోత్సవం జరిగింది. అయ్యప్ప మాలలు ధరించిన భక్తుల ఆధ్వర్యంలో మేళతాళాలు, కేరళ వాయిద్యాల నడుమ అయ్యప్పస్వామి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు అడుగడుగునా హారతులు పట్టి కొబ్బరికాయలు కొట్టారు. అనంతరం సోమేశ్వర ఆలయంలో కార్తీమాస వనభోజనాలు, అన్నదానం జరిగింది.

జీవనోపాధులపై శిక్షణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏపీఎం అనీల

కోట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కోటలోని వెలుగు కార్యాలయంలో వీవోఏలు, ఈసీ సభ్యురాళ్లకు జీవనోపాధులపై శిక్షణ కార్యక్రమం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఏపీఎం అనీల మాట్లాడుతూ పొదుపు మహిళలు ప్రణాళికా బద్ధంగా వ్యవహరించి ప్రగతికి బాటలు వేసుకోవాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వీవోఏలు గ్రామాల్లోకి వెళ్లి మహిళలను చైతన్య పరచాలన్నారు. సమావేశంలో సీసీలు ప్రసాద్, శంకర్, భాస్కర్, సుబ్రహ్మణ్యం, బిందు, తదితరులు పాల్గొన్నారు.

పద్మావతి అమ్మవారికి గొడుగుల వితరణ

తిరుచానూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి ఆలయానికి తమిళనాడుకు చెందిన భాష్యకార కైంకర్య ట్రస్టు చైర్మన్ మాధవనాయుడు 8 గొడుగులను అందజేశారు. సూపరింటెండెంట్ రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ వీటిని స్వీకరించి దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

బీమా చెక్కు అందజేత



ఇన్సూరెన్స్ చెక్కును అందజేస్తున్న ఎస్‌బీఐ సిబ్బంది

గూడూరు అర్బన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి ఎస్‌బీఐ నుంచి మంజూరైన రూ.20లక్షల బీమా చెక్కును చీఫ్ మేనేజర్ ఎస్ఎస్ఆర్ శర్మ గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైదాపురం మండలం తూర్పుపూండ్ల గ్రామానికి చెందిన వెంకటరాజా(28) ఇటీవల మనుబోలు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడన్నారు. ఆయన ఎస్‌బీఐలో సంవత్సరానికి రూ.1000 జనరల్ ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించేవారని, ప్రమాదవశాత్తు మృతి చెందడంతో రూ.20 లక్షలు మంజూరైందన్నారు. ఆ చెక్కును అతని తల్లి చిన్నరత్నమ్మకు అందజేయడం జరిగిందన్నారు. ఖాతాదారులు బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ వినోద్, ఇన్సూరెన్స్ అధికారి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



ప్రిన్సిపాల్, పీడీలకు క్రీడా పరికరాలను అందజేస్తున్న టీడీపీ నేత నానాజీ

చిల్లకూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని టీడీపీ సీనియర్ నాయకుడు తానంకి నానాజీ అన్నారు. గురువారం స్థానిక అంబేడ్కర్ గురుకుల పాఠశాలకు తానంకి నానాజీ దాతృత్వంతో రూ.25వేలు విలువ చేసే క్రీడా పరికరాలను ప్రిన్సిపాల్, పీడీలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే క్రీడలపై మక్కువ పెంచుకుని రాణించాలన్నారు. ఒత్తిడిని జయిస్తే చదువుల్లో రాణించవచ్చునన్నారు. కార్యక్రమంలో చిల్లకూరు పీఏసీఎస్ అధ్యక్షుడు కొండా రామచంద్రారెడ్డి, దాసరి రాము, మల్లికార్జున్, ప్రిన్సిపాల్ అనిల్‌కుమార్, పీడీ శిరేష్‌కుమార్, మురళి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు విద్యార్థుల ఎంపిక



హాకీ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

గూడూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక చిల్లకూరు శేషమ్మ మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికయ్యారని హెచ్‌ఎం శ్రీనివాసులు గురువారం తెలిపారు. అనే జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల్లో విద్యార్థులు జాన్‌హానోక్, డానియల్ జాషువా, ప్రవీణ్, షాలోమ్‌స్నేహిత్ ప్రతిభచాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. వారిని హెచ్‌ఎంతో పాటు వ్యాయామ ఉపాధ్యాయుడు సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు అభినందించారు.

సంఘమిత్రలు, వీవోఏలకు శిక్షణ

బాలాయపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక వెలుగు కార్యాలయంలో సంఘమిత్ర సభ్యులు, వీవోఏలకు గురు వారం శిక్షణ కార్యక్రమం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఏపీఎం కిరణ్ మాట్లాడుతూ రాబోయే ఐదు సంవత్సరాల్లో మండలాన్ని ఆదర్శంగా తీర్చి దిద్దేందుకు ఆరోగ్యం, విద్య, వ్యవసాయం, సామాజిక భద్రత, ఆస్తుల సృష్టి, సుస్థిర జీవనోపాధి అంశాలను దృష్టిలో పెట్టుకుని ప్రణాళికలు రూపొందించాలన్నారు. కార్యక్రమంలో శిక్షణాధికారి చెంగల్ రాయులు, ఎల్‌సీ సీసీ రాజేశ్వరి పాల్గొన్నారు.

రేపు చంద్రగిరిలో హాకీ టోర్నమెంట్

చంద్రగిరి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదా నంలో శనివారం నుంచి హాకీ టోర్నమెంట్ ప్రారంభించను న్నట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ భార్గవి కిషోర్ తెలి పారు. రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి అండర్ 14 హాకీ టోర్నమెంటులో క్రీడాకారులు పా ల్గొంటారని, ఇందులో బాలురు 234 మంది, బాలికలు 234 మంది ఉన్నారని వెల్లడించారు. పోటీలను కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే పులివర్తి నాని ప్రారంభిస్తారన్నారు.

ఎంఈవోలకు సహిత విద్యపై శిక్షణ

తిరుపతి(విద్య), నవంబరు 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఎంఈవోలకు సహిత విద్యపై ఒకరోజు శిక్షణ కార్యక్రమం శుక్రవారం తిరుపతిలోని ఎస్వీజేఎస్‌ఎం పాఠశాలలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డీఈవో కేవీఎన్ కుమార్ మాట్లాడుతూ... భవిత సెంటర్లను తరచూ పర్యవేక్షించాలని, ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ప్రభుత్వం కల్పిస్తున్న పథకాల గురించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ గౌరీశంకర్‌రావు, సహిత విద్య సమన్వయకర్త చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ తిరుపతి, గూడూరు, పుత్తూరు, శ్రీకాళహస్తి, వెంకటగిరి, పిచ్చాటూరు, తడ మండలాలకు కొత్తగా ఏడు ఆటిజం కేంద్రాలు మంజూరయ్యాయని చెప్పారు. ఆటిజం ఉన్న పిల్లలు కూడా సమాజంలో స్వతంత్రంగా జీవించేలా చెయ్యడం మనందరి బాధ్యత అని చెప్పారు. కార్యక్రమంలో జిల్లాలోని 68మండలాల ఎంఈవోలు, తిరుపతి, పుత్తూరు, గూడూరు డీవైఈవోలు, సమగ్రశిక్ష సెక్టోరియల్ అధికారులు, రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గౌరీ శంకర్‌రావు

శ్రీకాళహస్తి
సత్యవేడు

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



అఖిల-షర్మిల-పిలోమని

వరదయ్యపాళెం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మచిలీపట్నంలో జరిగే రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు బత్తలవల్ల జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎస్.అఖిల ఎంపికైంది. 9వతరగతి చదువుతున్న ఈమె అండర్ -14 విభాగంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించనుంది. షర్మిల అండర్-14 విభాగంలో నెట్‌బాల్ పోటీలకు ప్రాతినిధ్యం వహించనుంది. వీరిని, వ్యాయామ ఉపాధ్యాయుడు కుమార్‌ను ప్రధానోపాధ్యాయురాలుజయసుధ,ఉపాధ్యాయులు గురువారం అభినందించారు. **కేవీబీపురం:** మండలకేంద్రంలోని కేజీబీవీలో 9వ తరగతి విద్యార్థి పిలోమని బుచ్చినాయుడుకండ్రిగ ఉన్నత పాఠశాలలో గురువారం జరిగిన అండర్-14 కబడ్డీలో ఉత్తమ ప్రతిభ కనబరచింది. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. విద్యార్థిని పీటీ సతీసావిత్రి, ప్రిన్సిపాల్ సుకన్య, ఉపాధ్యాయులు అభినందించారు.

అంకాలమ్మ ఆలయం వద్ద అన్నదానం



శ్రీకాళహస్తి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): స్థానిక పీవీరోడ్డులో అంకాలమ్మ ఆలయం వద్ద గురువారం అమావాస్య సందర్భంగా నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. నాలుగేళ్లుగా ప్రతి అమ్మవాస్యకు భక్తులకు అన్నదానం చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. యశ్వంత్‌రావు, సత్యనారాయణరావు, శ్రావన్‌రావు, ప్రదీప్‌రావు, శివకుమార్‌రెడ్డి, కార్తీక్‌రావు, జయగణేష్, మురళి జాదవ్, క్రాంతికుమార్, వినీత్‌రెడ్డి, డాక్టర్ కృపానిధి పాల్గొన్నారు.

సచివాలయాన్ని వీడని నీరు



కేవీబీపురం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కళత్తూరులో సచివాలయ కార్యాలయం ఇప్పటికీ మురుగునీటి మధ్యే ఉంది. కాస్త తగ్గుతుందనే ఇటీవల కురిసిన వర్షాలకు మళ్లీ కార్యాలయం చుట్టూ నీరుచేరింది. నీరు పోయే మార్గం లేదు. ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారు. స్తంభాలను ఏర్పాటు చేసి వాటికి విద్యుత్ కనెక్షన్లు ఇచ్చారు. విరిగిన స్తంభాలను గ్రామం నుంచి తరలించారు. సుమారు 90 స్తంభాల వరకు విరిగి పనికిరాకుండా పోయాయి. ఇంకా గ్రామంలో పునరుద్ధరణ పనులు కొనసాగుతూనే ఉన్నాయి.

విజేతలకు బహుమతుల ప్రదానం



శ్రీకాళహస్తి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పట్టణ గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని పలు పోటీల్లో విజేతలైన విద్యార్థులకు గురువారం బహుమతులను ప్రదానం చేశారు. ఏపీ టీడబ్ల్యూఆర్ బాలుర ఉన్నత పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రద్యుమ్న వర్మ, జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తీగల వెంకటయ్య ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి లావణ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా బాలల హక్కుల దినోత్సవం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ప్రగతి సంస్థ సభ్యులు,విద్యార్థులు

ఏర్పేడు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): కందాడు జడ్పీ ఉన్నతపాఠశాలలో ప్రకృతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రగతి సంస్థ డైరెక్టర్ కేవీ రమణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ హక్కులు పెద్దవారికే కాదని బాలలకు కూడా వర్తిస్తాయన్నారు. అంతర్జాతీయ బాలల హక్కుల ఒడంబడికకు 36ఏళ్లు అయిందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వరప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డుకు ఎమ్మెల్యే భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

సత్యవేడు, నవంబరు 20(ఆంధ్ర జ్యోతి): రూ.2.34 కోట్లతో అల్లప్పగుంట నుంచి కన్నావరం క్రాస్ వరకు నిర్మించనున్న బీటీ రోడ్డుకు ఎమ్మెల్యే ఆదిమూలం గురువారం భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారుల వెంటబడి అభివృద్ధి పనులు చేయిస్తానన్నారు. అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందేలా చూస్తానని వివరించారు. ఎన్టీఆర్ గృహ కల్ప పథకం ద్వారా పక్కా ఇల్లు నిర్మాణానికి దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

రాష్ట్రపతికి ముక్కంటి ప్రసాదాలు



రాష్ట్రపతికి ముక్కంటి ప్రసాదాలు అందజేస్తున్న సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి పర్యటన నిమిత్తం గురువారం సాయంత్రం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న రాష్ట్రపతి ద్రౌపదిముర్ముకు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి స్వాగతం పలికారు. ఈసందర్భంగా ఆమెకు ముక్కంటి ప్రసాదాలను అందజేశారు.

ముక్కంటి ఆలయ చైర్మన్, సభ్యులకు సన్మానం



చైర్మన్ కొట్టే సాయి, సభ్యులను సత్కరిస్తున్న పల్లమాల సుధాకర్

శ్రీకాళహస్తి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తలమండలి చైర్మన్, సభ్యులను పల్లమాల సుధాకర్ గురువారం ఆలయంలోని పరిపాలన భవనం వద్ద మర్యాదపూర్వకంగా కలిశారు. చైర్మన్ కొట్టే సాయి, సభ్యులు దండి రాఘవయ్య కోలా వైశాలి, పగడాల మురళి, జి.గోపీనాథ్, రుద్రాక్షల కౌసల్యమ్మను సత్కరించారు. ఆలయ అభివృద్ధికి, భక్తుల సౌకర్యాలను మెరుగుపరచాలని ఆయన వారిని కోరారు. కార్యక్రమంలో జయబాబు, పగడాల ప్రతాప్, పగడాల సుధాకర్, రాధాకృష్ణ, చంద్రశేఖర్, నవీన్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

వేదోక్తంగా గురుదక్షిణామూర్తికి పూజలు



శ్రీకాళహస్తి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో మేధో గురుదక్షిణామూర్తికి గురువారం వేదోక్తంగా పూజలు నిర్వహించారు. వినాయక కలశ పూజ వైదిక క్రతువులనంతరం స్వామివారికి వైభవంగా అభిషేకం నిర్వహించారు. సుగంధ పూలు, స్వర్ణాభరణాలతో విశేషంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. మహా మంగళ హారతులు ఇచ్చారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

23న మలయాళస్వామి విగ్రహ ప్రతిష్ట

ఏర్పేడు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): వ్యాసాశ్రమ వ్యవస్థాపకులు, సద్గురువులు మలయాళస్వామి విగ్రహాన్ని ఈ నెల 23న ఏర్పేడులో ప్రతిష్ఠించనున్నారు. ఆ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు కావాలని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డిని ఆశ్రమ పూర్వవిద్యార్థులు ఆహ్వానించారు. స్వామి వివేకానంద చిత్రపటానికి ఎమ్మెల్యేకు వారు బహూకరించారు.

ఆలయ బోర్డు ఏర్పాటుకు వినతి

ఏర్పేడు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): గుడిమల్లం పరశురామేశ్వరాలయానికి సంబంధించిన బోర్డును తిరుపతి నగరంలో ఏర్పాటు చేసేందుకు అనుమతి ఇవ్వాలని ఈ వో రామచంద్రారెడ్డి తిరుపతి నగర పాలక కమిషనర్ మౌర్యను కోరారు. గురువారం ఆమెను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆమె సానుకూలంగా స్పందించి త్వరలోనే అనుమతి లేఖ ఇస్తామని తెలిపారు. నగరపాల సంస్థ కమిషనర్ మౌర్యలకు ఈవో రామచంద్రారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

ఆలయ ఉద్యోగి మృతికి సంతాపం

శ్రీకాళహస్తి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో మృతి చెందిన శ్రీకాళహస్తీశ్వరాలయ స్టోర్స్ విభాగం కాంట్రాక్టు ఉద్యోగి రాజశేఖర్ మృతి ఆలయ ఉద్యోగులు సంతాపం ప్రకటించారు. డెంగ్యూ జ్వరంతో పాటు పచ్చకామెర్లు అధికమై గురువారం ఆయన మృతి చెందాడు. వైద్య ఖర్చుల కోసం ఆలయ అధికారులతో పాటు సహోద్యోగులు ఆర్థిక సాయం చేశారు. రాజశేఖర్ కుటుంబాన్ని ఆదుకోవాలని ఆలయ అర్చకులు పాలూరి నరసింహమూర్తి కోరారు.

ఎలక్ట్రీషియన్ ఆత్మహత్య



బాలాజీ మృతదేహం

శ్రీకాళహస్తి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత కారణాలతో బాలాజీ(31) అనే యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శ్రీకాళహస్తి ఒకటో పట్టణపోలీసుల కథనం మేరకు ముత్యాలమ్మ గుడివీధికి చెందిన బాలాజీ ఓ ఫ్లెక్సీ ప్రింటింగ్ కేంద్రంలో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తుండేవాడు. వివాహం కాలేదని తరచూ సన్నిహితుల వద్ద వాపోతుండేవాడు. ఈ క్రమంలో గురువారం ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఒంటరితనం తాళలేక ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతుని కుటుంబసభ్యులు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు



విజేతలతో గ్రంథాలయ అధికారులు తదితరులు

శ్రీకాళహస్తి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో గ్రంథాలయ వారోత్సవాలు గురువారం ముగిశాయి. ఈక్రమంలో వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం, మ్యూజికల్ చైర్స్ పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఎంపీడీవో సురేంద్రనాథ్ గ్రంథాలయ అధికారి హరికృష్ణ, బాలికల వసతిగృహ అధికారి జయసుధ, రీడర్స్‌క్లబ్ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏఎంసీ చైర్మన్‌గా చెంచయ్య నాయుడు



సీఎం చంద్రబాబుతో చెంచయ్యనాయుడు,ఎమ్మెల్యే సుధీర్

శ్రీకాళహస్తి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి వ్యవసాయ కమిటీ మార్కెట్ కమిటీ(ఏఎంసీ) చైర్మన్‌గా టీడీపీ సీనియర్ నాయకుడు రంగినేని చెంచయ్యనాయుడు ఎంపికయ్యారు. ఈ మేరకు గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. గౌరవాధ్యక్షుడిగా ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, వైస్ చైర్మన్‌గా గంగిరెడ్డి, సభ్యులుగా సామా అంకయ్య, కె.మాధవరెడ్డి, దాసరి చలపతి, ఎర్రి రమేష్, వై.చంద్రవతి, కె.భాగ్యలక్ష్మి, గాలి భూలక్ష్మి, ఎ.రేష్మ, కండ్రిగ జయకుమారి, ఎం.సునీత, ఎస్కే మహమ్మద్, మండల యానాదయ్య, షేక్ హమీదా, పీఏసీఎస్ అధ్యక్షుడు, అగ్రికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్, పురపాలకసంఘ ప్రత్యేక అధికారి, జిల్లా అగ్రిట్రేడ్, అండ్ మార్కెటింగ్ ఆఫీసర్‌లు నియమితులయ్యారు. చెంచయ్యనాయుడు రెండవ సారి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించడం విశేషం. మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి హయంలో ఆయన మార్కెట్‌కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. చెంచయ్యనాయుడు హయాంలోనే మార్కెట్‌కమిటీ ఆవరణంలో ప్రతి శుక్రవారం సంత ఏర్పాటైంది. ఇది స్థానికప్రజలు, పరిసర గ్రామాలకు సౌకర్యంగా మారింది. తెలుగుదేశం పార్టీకి చెందిన పలువురు నాయకులు హర్షం ప్రకిటించారు. గురువారం ఆయన్ను వారు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా బాలల హక్కుల వారోత్సవాలు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంపీడీవో పద్మజ, చంద్రశేఖర్,విద్యార్థులు

శ్రీకాళహస్తి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి మండలం ఎక్కరగుడిపాడులో గురువారం ప్రగతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఎంపీడీవో పద్మజ బాలల హక్కుల సంరక్షణ వారోత్సవాల సందర్భంగా పోస్టర్లను ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ బాలలకు పెద్దలతోపా టు హక్కులు ఉంటాయన్నారు. వాటి సంరక్షణకకు ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రగతి స్వచ్ఛంద సంస్థ మండల కోఆర్డినేటర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. ఇక మండలంలోని ఓబులాయపల్లి, మంగళపురి పాఠశాలల్లో కూడా విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

కరపత్రాల ఆవిష్కరణ



శ్రీకాళహస్తి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జమాతే ఇస్లామీ హింద్ సంస్థ ఆధ్వర్యంలో గురువారం పొరుగువారి హక్కుల ఉద్యమంపై పుస్తకలు, కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా సంస్థ సభ్యులు మాట్లాడుతూ ఈ నెల 30 వరకు కార్యక్రమంజరుగుతుందన్నారు. పట్టణ ప్రజలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో న్యాయవాది నిస్సారాలీ, సంస్థ పట్టణాధ్యక్షులు మహమ్మద్, ముజమ్మిల్ అహ్మద్, అబ్దుల్ నాసిర్, రఫీ, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

జనసేన నేతల అన్నదానం

శ్రీకాళహస్తి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు వద్ద గురువారం జనసేన ఆధ్వర్యంలో డొక్కాసీతమ్మ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆశయాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జనసేన నాయకులు పాల్గొన్నారు.

పైపులైన్ పగిలి నీరు వృథా



సత్యవేడు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): కన్నావరంలో తాగునీటి పైపులైన్ పగిలి నీరు వృథాగా పోతోంది. వేపచెట్టు సమీపంలో కల్వర్టు వద్ద పైపులైన్ వారం రోజుల క్రితం పగిలింది. దీంతో రోడ్డు బురదమయంగా మారి వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా స్పందించి పైపులైన్‌ని మరమ్మతులు చేపట్టి నీటి వృథాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు. పంచాయతీ కార్యదర్శి మణికంఠను వివరణ కోరగా ఇదివరకే పైపులైన్‌కు మరమ్మతు చేసినా ఇటీవల మళ్లీ పైపులైన్ పాడైందన్నారు. మరమ్మతులు చేపడతామన్నారు.

ఏఎంసీ చైర్మన్‌కు అభినందనలు



చెంచయ్య నాయుడిని సత్కరించిన నింద్ర సుధాకర్

శ్రీకాళహస్తి: నవంబరు 20(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన రంగినేని చెంచయ్యనాయుడిని గురువారం టీడీపీ నాయకులు కలిసి అభినందించారు. పార్టీ నాయకడు నింద్ర సుధాకర్ ఆయను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాని ఆకాంక్షించారు.

పరశురామేశ్వరుడి సేవలో ఆర్కియాలజీ డైరెక్టర్

ఏర్పేడు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): గుడిమల్లం పరశురామేశ్వరస్వామిని గురువారం ఆర్కియాలజీ డైరెక్టర్ భీమా అజ్మీర కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ మాజీ చైర్మన్ గిరినాయుడు, ఈవో రామచంద్రారెడ్డి స్వాగతం పలకి దర్శన ఏర్పాట్లు చేశారు. వేదపండితులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

పుత్తూరు వార్తలు

కట్నం కోసం వేధింపులు

వడమాలపేట,నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):అదనంగా కట్నం తేవాలంటూ భర్త వేధిస్తున్నాడని భార్య ఫిర్యాదు చేసింది. వడమాలపేట నారాయణదాసుతోటకు చెందిన మురళికి తిరుపతిలోని కొర్లగుంటకు చెందిన దివ్యతో 2018లో వివాహమైంది. ఇటీవల అదనంగా కట్నం తేవాలని మురళి తరచూ వేదిస్తున్నాడని భార్య పోలీసులకు గురువారం ఫిర్యాదు చేసింది. కేసునమోదు చేసినట్లు ఎస్ఐ ధర్మారెడ్డి తెలిపారు.

ఫెన్సింగ్ కమ్మీల తొలగింపుపై ఫిర్యాదు

● తిరుమణ్యం రాజులకండ్రిగలోని పట్టా భూమిలో ఫెన్సింగ్ కమ్మీలను దౌర్జన్యంగా తొలిగించాడో వ్యక్తి. గ్రామానికి చెందిన. మోహన్ రాజు వేసుకొన్న ఫెన్సింగ్‌లో కొంత మేర కమ్మీలను బాలసుబ్రమణ్యం తొలగించినట్లు బాధితుడు ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ తెలిపారుచెప్పారు.

ప్రగతికి సోపానాలు పుస్తకాలు



వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులతో గ్రంథాలయ అధికారులు

పుత్తూరు,నవంబరు20(ఆంధ్రజ్యోతి):ప్రగతికి సోపానాలైన పుస్తకాలను చదవడం అలవాటు చేసుకోవాలని సాహితీవేత్త విశ్రాంత ప్రిన్సిపాల్ గుణశేఖర్ నాయుడు విద్యార్థులకు హితవు పలికారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీ పరీక్షలలో గెలుపొందిన వారికి బహుమతులను అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చంద్రమౌళి, అధ్యాపకులు పాల్గొన్నారు. గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ బాలకల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మరో కార్యక్రమంలో 46 మంది విద్యార్థులకు బహుమతులను అందించారు. ప్రధానోపాధ్యాయులు శశికళ, భువనేశ్వరి, గ్రంథాలయాధికారి మీనాకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇళ్ల మంజూరు అర్హత పత్రాల పంపిణీ



లబ్ధిదారులకు అర్హత పత్రాలను అందజేస్తున్న భానుప్రకాష్

పుత్తూరు అర్బన్, నవంబర్ 20(ఆంధ్రజ్యోతి): గుడిసె రహిత ప్రాంతంగా పుత్తూరును తీర్చిదిద్దేందుకు సీఎం చంద్రబాబు చంద్రబాబు సంకల్పించారని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ, పీఎంఏవై 2.0 సంయుక్త ఆధ్వర్యంలో లబ్ధిదారులకు ఇళ్ళ మంజూరు పత్రాలను ఆయన బుధవారం అందజేశారు పీఎం స్వానిధి పథకం కింద వీధి విక్రయదారులకు రూ.4.67 కోట్ల మేర రుణాల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేమాట్లాడుతూ.. నివాస స్థలాలు ఉన్న 325 మందికి ఇళ్ల నిర్మాణం కోసం నిధుల మంజూరుకు అర్హత పత్రాలను అందజేశామన్నారు. 1060 టిడ్కో ఇళ్లలో తొలి విడతగా 432 మందికి అందజేస్తామన్నారు. మిగిలిన ఇళ్లను కూడా నిర్మాణ పనులు పూర్తి చేసి అందజేస్తామన్నారు. అర్హత కలిగి ఇళ్లు లేని ప్రతి ఒక్కరు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర పద్మశాలి, వన్నెకుల క్షత్రియ, మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్లు గంజి మాధవయ్య, షణ్ముగరెడ్డి, డీఎన్ ధనపాల్, మార్కెట్ యార్డ్ చైర్మెన్ డీఎస్ గణష్, మున్సిపల్ కమిషనర్ డి.ఎన్.నాగేశ్వరరావు, నాయకులు అమ్ములు, జీవరత్నం నాయుడు, కరుణాయాదవ్, కేశవాచ్చారి, రాధా, యుగంధర్, అంకయ్య, ఆనంద్, కృష్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు. కాగా స్థానిక ఖాదర్ వల్లి దర్గాలో డిసెంబర్ 5 నుంచి 7వ తేదీ వరకు జరిగే గంధపు మహోత్సవాల పోస్టర్‌ను ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ఆవిష్కరించారు.